
ఆంధ్రజ్యోతి



తాకట్టు.. 'కనికట్టు!

పర్యాటకాభివృద్ధి సంస్థలో ఉన్నతాధికారుల రూటే సపరేటు'గా ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. లాభాల్లో ఉన్న హరిత బెర్మ్ పార్క్‌ను రూ.110 కోట్లకు ఓ బ్యాంకులో తాకట్టు పెట్టారు. ఇప్పుడు ఆ తాకట్టులోని పర్యాటక యూనిట్లను ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పర్యాటకాభివృద్ధి సంస్థ మాయాజాలం

రూ.110 కోట్లకు హరిత బెర్మ్ పార్క్ తాకట్టు

- గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్నతాధికారుల నిర్వాకం
- **ఇప్పుడు 'స్టెర్లింగ్' సంస్థకు పర్యాటక యూనిట్లు కట్టబెట్టేందుకు యత్నం**
- **లాభాల్లోని యూనిట్లను ప్రైవేటుకు ఇవ్వకూడదన్న ఏపీటీడీసీ పాలకవర్గం**
- అయినా వినని ఉన్నతాధికారులు.. అంతా గందరగోళం!

తాకట్టు నుంచి విడిపించండి!



ప్రస్తుతం తాకట్టులో ఉన్న హరిత బెర్మ్‌పార్క్‌ను తక్షణం విడిపించే చర్యలు చేపట్టాలి. రూ. 110 కోట్లకు రుణ అగ్రిమెంట్ ఉన్నా చేసిన పనులను బట్టి సగాని కంటే తక్కువగానే బ్యాంకుల నుంచి చెల్లింపులు జరిగాయని తెలుస్తోంది. కాబట్టి ప్రభుత్వం ఈ డబ్బులను బ్యాంకుకు ఫండ్‌గా ఇచ్చి.. రుణ విముక్తి కల్పించి.. వచ్చిన ఆదాయంలో కొంత డబ్బుతో ఆధునీకరణ చేపట్టుకునేలా వారికి స్వయం ప్రతిపత్తి ఇస్తే సరిపోతుంది. దీనివల్ల పర్యాటకులకు భారం కానీ పర్యాటకం అందుబాటులోకి వస్తుంది.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో తాకట్టు.. ఆపైన కనికట్టు వ్యవహారం నడుస్తోంది. వైసీపీ హయాంలో హరిత బెర్మ్ పార్క్‌ను తాకట్టు పెట్టి రూ.110 కోట్ల రుణ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ రుణాలతో పర్యాటక యూనిట్లలోని కాటేజీలు, రిసార్టుల రెన్నోవేషన్ చేపట్టారు. ఈ పనుల వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం రాకతో కొలువుతీరిన ఏపీటీడీసీ బోర్డు వైసీపీ హయాంలో జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు ఒక్కో ఇటుక పేరుస్తుంటే.. ఉన్నతాధికారులు వాటికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. హరిత బెర్మ్‌పార్క్‌పై రూ.110 కోట్ల అప్పు తీసుకుని భవానీ ఐల్యాండ్‌తో సహా రాష్ట్ర వ్యాప్తంగా పలు యూనిట్ల ఆధునీకరణ పనులు చేపట్టిన ఏపీటీడీసీ అధికారులు వీటిని గంపగుత్తగా 'స్టెర్లింగ్' అనే సంస్థకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. బ్యాంకు తనఖాలో ఉన్న ఆస్తులను ప్రైవేటు సంస్థలకు అసలు కట్టబెట్టవచ్చా? ఆ ప్రైవేటు సంస్థ ఏ విధంగా తీసుకుంటుంది? అన్న అంశాలు తాజాగా చర్చనీయాంశం అవుతున్నాయి. ఇలాంటి వ్యవహారాల్లో అనేక న్యాయపరమైన

మిగతా 6లో..

ఎవరి ప్రయోజనం కోసం ఈ తాపత్రయం?

రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో పర్యాటక శాఖను పర్యవేక్షించే ఓ ఉన్నతాధికారి త్వరలో పదవీ విరమణ చేయనున్నారు. ఈయన తన పదవీ విరమణ లోపు అద్భుతమైన ప్రాజెక్టులను చేపట్టానన్న పేరు కోసం పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణ విషయాన్ని తెర మీదకు తీసుకు వచ్చారు. ఇది కనుక సాకారమైతే.. ఆయనకు మరికొంత కాలం ఎక్స్‌టెన్షన్ లభించవచ్చన్నది ఆలోచనగా ఉన్నట్టు తెలుస్తోంది.

సామాన్యులపై ధరల భారం ఉండకూడదన్న సీఎం

ఇటీవల పర్యాటక శాఖ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా కొందరు ఉన్నతాధికారులు పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణ అంశాన్ని తీసుకువచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించలేదు. ఆయా పర్యాటక యూనిట్ల పరిస్థితులను మదింపు చేసి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. పేదలకు ధరల భారం ఉండే పరిస్థితి రాకూడదని కూడా స్పష్టం చేశారు. భారీ స్థాయిలో వచ్చేవి, బల్క్‌గా, కొత్తగా చేపట్టే ప్రాజెక్టుల విషయంలో పీపీపీ విధానాలను అవలంబించాలని మొదటి నుంచి ఆయన చెబుతున్నారు. పర్యాటక పాలసీలో కూడా కేటగిరీల వారీగా ప్రోత్సాహకాలను వెలువరించారు. ఇంత స్పష్టంగా ఉన్నా కూడా పర్యాటక శాఖ అధికారులు తమ రూటే సెపరేటు అన్నట్టు వ్యవహరిస్తున్నారు.

నున్న పవర్ గ్రిడ్



తొలగిస్తే పోయేదానికి.. రూ.కోటి అద్దె చెల్లించారు!

సబ్ స్టేషన్లు లేని సమయంలో 'నున్న పవర్ గ్రిడ్'లో 2 'బే'ల ఏర్పాటు

నెలకు రూ.2 లక్షల అద్దె చెల్లిస్తున్న ట్రాన్స్‌కో

- సబ్ స్టేషన్ల సంఖ్య పెరగడంతో 2022 నుంచి నిరుపయోగంగా 'బే'లు
- **తొలగించకుండా ఇంకా అద్దె చెల్లిస్తున్న అధికారులు**

ట్రాన్స్‌కో అధికారుల తీరు అనేక విమర్శలకు దారితీస్తోంది. నాటి అవసరాల కోసం నున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఏర్పాటు చేసిన రెండు 'బే'లు 2022 నుంచి నిరుపయోగంగా ఉంటున్నాయి. రూ.20 లక్షలు ఖర్చు చేసి తొలగించాల్సిన వీటికి నెలకు రూ.2 లక్షల చొప్పున ఇప్పటి వరకు రూ.కోటి అద్దె చెల్లించారు. ఇంకా చెల్లిస్తూనే ఉన్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గతంలో తగినన్ని సబ్‌స్టేషన్లు లేకపోవటంతో విద్యుత్ సరఫరా అవసరాలను తీర్చటం కోసం విజయవాడ శివారు నున్న పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్)లో రెండు 'బే' లను ట్రాన్స్‌కో ఏర్పాటు చేసింది. ఈ 'బే'ల ద్వారా ట్రాన్స్‌కో లైన్స్‌కు విద్యుత్ సరఫరా అవుతుంది. కాలక్రమంలో ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్లను గణనీయంగా పెంచుకుంది. సత్తెనపల్లి, వేమగిరి వంటి జిల్లాయేతర ప్రాంతాల్లో కూడా సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసుకుంది. దీంతో నున్నలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌లోని 'బే'ల అవసరం లేకుండా పోయింది. ఇక్కడ 'బే'లను నిర్వహిస్తున్నందుకు నెలకు రూ.2 లక్షలు పీజీసీఐఎల్‌కు ట్రాన్స్‌కో అద్దె చెల్లిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ 'బే'ల వినియోగం నిలిచిపోయింది. దీంతో 2022 నుంచి నిరుపయో గంగా ఉంటున్న ఈ 'బే'లను తొలగించాల్సి ఉన్నా ఆ పని చేయలేదు. వైసీపీ ప్రభుత్వం దృష్టికి వెళ్లినా కూడా పట్టించుకోకపోవటంతో అప్పటి నుంచి ట్రాన్స్‌కో అధికారులు అద్దె చెల్లిస్తూనే ఉన్నారు. దాదాపుగా నాలుగేళ్లుగా రూ.కోటి వరకు అద్దె చెల్లించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పది నెలలుగా ట్రాన్స్‌కో అధికారులు ఉత్త పుణ్యానికి పీజీసీఎల్‌ఐకి అద్దె చెల్లిస్తున్నారు. నున్న పవర్ గ్రిడ్‌లో ఉన్న రెండు 'బే'లను తొలగించటానికి రూ.20 లక్షలు ఖర్చు చేస్తే సరిపోతోంది. ఈ పని చేయటానికి ట్రాన్స్‌కో అధికారులకు చేతులు రావటం లేదు. టెండర్లు పిలుస్తున్నారు కానీ మళ్లీ ఎందుకు ఆగిపోతుందో అర్థం కావటం లేదు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి ట్రాన్స్‌కో పై పడుతున్న అద్దె భారాన్ని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉక్కపోత




విజయవాడ, మే 13 (ఆంధ్ర జ్యోతి): జిల్లాను ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గడచిన రెండు రోజులుగా రికార్డు స్థాయిలో వరుసగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. గురువారం మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడు గంటల వరకు రహదారుల నుంచి వెచ్చని సెగలు పైకి వచ్చాయి. వేడి గాలులు వీయడంతో మాస్కులు, స్కార్ఫ్‌లు కట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. కూల్‌డ్రింక్ షాపులు, జ్యూస్ షాపులు కిటకిటలాడాయి. సాయంత్రం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలులు వీయడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. దినసరి కూలీలు వేకువజామున పనులు ప్రారంభించి మధ్యాహ్నం 12 గంటలకు ముగించారు. భవన నిర్మాణ కార్మికులూ ఈ విధంగానే చేశారు.

గందరగోళం!

బియ్యం కార్డుల జారీలో గజిబిజి

జిల్లాలో బియ్యం కార్డుల జారీలో గందరగోళం నెలకొంది. స్పష్టమైన విధి విధానాలు లేకపోవడంతో ఈ ప్రక్రియ సక్రమంగా ముందుకు సాగడంలేదు. దీనికి తోడు అధికశాతం సచివాలయాల్లో కంప్యూటర్‌లు మొరాయిస్తున్నాయి. సచివాలయ సిబ్బంది కార్డుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి కంప్యూటర్‌లు బాగుపడితే వివరాలు నమోదు చేస్తామని, ఎలాంటి మార్పులు చేయాలో వివరాలు రాసి ఇచ్చి వెళ్లమని చెబుతున్నారు. బియ్యం కార్డుల జారీలో ప్రభుత్వం విధించిన నిబంధనలకు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులకు పొంతన లేకపోవడంతో పేదలు, సచివాలయ సిబ్బంది, పౌరసరఫరాలశాఖ అధికారులు అయోమయానికి గురవుతున్నారు. వెంటనే నిబంధనలు సడలించాలని ప్రజలు కోరుతున్నారు.

- వితంతువులకు ప్రత్యేక కార్డు కుదరదట!
- **చిన్న కుటుంబానికి కొత్త కార్డు జారీపై ఆంక్షలు**
- **ఉద్యోగులు, వ్యాపారులైన బిడ్డల పేర్లు కార్డు నుంచి తొలగింపులో ఇక్కట్లు**
- **సచివాలయాల్లో మొరాయిస్తున్న కంప్యూటర్లు**
- **ఈ నెలాఖరులోగా బియ్యం కార్డుల జారీ పూర్తయ్యేనా!**



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 5.22 లక్షల బియ్యం కార్డులున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా 2020లో గ్రామాల్లో, వార్డుల్లో ఇంటింటికీ తిరిగి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయించారు. ఒక కుటుంబంలో ఎంత మంది ఉంటున్నారు, వారి ఇంటి నెంబరు, నివాసం, కుటుంబసభ్యుల సంఖ్య, వారి బియ్యం కార్డులు, ఆధార్‌కార్డుల నెంబర్లు తదితర వివరాలన్నీ నమోదుచేశారు. ఈ ఐదేళ్లలో వివాహాలు చేసుకున్న వారు వేరు కాపురం ఉంటూ మరో చోట నివసిస్తున్నారు. వీరు కొత్తకార్డు కోసం సచివాలయానికి వెళితే గతంలో జరిగిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఆధార్ కార్డు నెంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలు మొత్తం వస్తున్నాయి. మీకు కొత్తకార్డు ఇవ్వాల్సి వస్తే మీ తల్లిదండ్రులలో ఎవరైనా ఒకరు ఉంటే వారి పేరును కూడా మీ పేరున ఇచ్చే కార్డులోనే చేరుస్తామని చెబుతున్నారు

- నాలుగైదేళ్ల క్రితం వివాహం చేసుకుని, ఒకరు లేదా ఇద్దరు సంతానం ఉన్న వారు నూతన బియ్యం కార్డు కావాలని అడుగుతున్నారు. గతంలో ఉన్న కార్డులోనే ఇంటికి కోడలిగా వచ్చిన మహిళ పేరును, వారిపిల్లల పేర్లను చేరుస్తామని చెబుతున్నారు. ఇందు కోసం వివాహం జరిగినట్లుగా వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పెళ్లి పొటోలు, శుభలేఖ తదితరాలను ఇవ్వాలని షరతులు పెడుతున్నారు. దీంతో పాటు వేరే గ్రామానికి చెందిన మహిళ వివాహం చేసుకుని, తన పుట్టింటి వద్ద తల్లిదండ్రులతోపాటు బియ్యం కార్డులో పేరు ఉంటే అక్కడి పేరును తీసివేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని, కొత్తదంపతులు ఇద్దరూ సచివాలయానికి వచ్చి వేలిముద్రలు వేయాలని కూడా పేర్కొంటున్నారు.
- ఒక కుటుంబంలో తల్లిదండ్రులు, ఇద్దరు కుమారుల పేరుతో ఇప్పటికే కార్డు ఉంది. కానీ ఇద్దరు కుమారులు వివాహల అనంతరం వేర్వేరుగా కాపురం ఉంటున్నారు. ఇటీవల కాలంలో కుటుంబ పెద్ద చనిపోయాడు. వితంతువుగా మారిన తల్లి తన కుమారులు వివాహాలు చేసుకుని వేర్వేరుగా ఉంటున్నారని, తన ఒక్కరి పేరుతోనే బియ్యం కార్డు ఇవ్వాలని కోరితే అలా ఇవ్వడం కుదరదని, ఆన్‌లైన్‌లో ఇందుకు అవకాశం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. ఇద్దరి కుమారుల్లో

మిగతా 6లో..

పనిచేయని కంప్యూటర్‌లు

ఒక్కో సచివాలయంలో రెండు కంప్యూటర్‌లు ఉన్నాయి. జిల్లాలోని అధికశాతం సచివాలయాల్లో ఇవి పనిచేయడంలేదు. వీటికి మరమ్మతులు చేయించాలని మునిసిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలకు సచివాలయ అడ్మిన్‌లు లేఖలు రాశారు. కానీ వాటికి మరమ్మతులు చేయనేలేదు. ఇలాంటి స్థితిలో బియ్యంకార్డుల జారీ ప్రక్రియ ఎంతమేర ముందుకు సాగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

అప్‌గ్రేడ్

68 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మారుస్తూ జీవో జారీ

విద్యాశాఖలో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం



మచిలీపట్నం, మే13(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మంగళవారం జీవోఎంఎస్ నెంబర్ 21ని జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని 68 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో 117 జీవో ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన సమయంలో అక్కడకు పనిచేసేందుకు వెళ్లిన ఉపాధ్యాయులను మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 241 మందిని సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తూ మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలలకు డెప్యుటేషన్ లేదా ప్రభుత్వ ప్రత్యేక బదిలీల్లో భాగంగా వెళ్లి ఎనిమిది సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారు, పదవీ విరమణకు దగ్గరలో ఉన్న 51 మందిని తమ మాతృ సంస్థలకు వెళ్లిపోతామని దరఖాస్తు చేసుకోవడంతో వారిని మాతృసంస్థకు పంపుతూ ఆదేశాలు వెలువడ్డాయి. దీంతోపాటు త్వరలో డీఎస్సీ ద్వారా భర్తీ చేసే టీచర్ పోస్టులలో భాగంగా జిల్లాలో ప్రధానోపాధ్యాయులకు సంబంధించి 29 ఖాళీలను, స్కూల్ అసిస్టెంట్‌లకు సంబంధించి 247 ఖాళీలను మొత్తంగా 276 పోస్టులను పూలింగ్‌లో పెట్టారు. ఉమ్మడి జిల్లాలోని 68 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్పుచేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో వేసవి సెలవుల అనంతరం అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లోని తరగతులకు సరిపడా టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులపై బుధవారం సమావేశాలు నిర్వహించి, ప్రతి అంశంపైనా చర్చించి, ఆ తర్వాత తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు.

సైనికులకు మనోధైర్యం కల్పించాలి

- సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

8లో



సందర్శకులతో నవలంక కళకళ

8లో





ధనంబోడును వీక్షిస్తున్న పిరమిడ్, బుద్దిస్ట్ సొసైటిల సభ్యులు

ధనంబోడు బౌద్ధారామాన్ని సందర్శించిన పిరమిడ్, బుద్దిస్ట్ సొసైటీ సభ్యులు

జగ్గయ్యపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని ధనంబోడు బౌద్ధారామాన్ని పలువురు బుద్ధిస్ట్, పిరమిడ్ సొసైటీల సభ్యులు సందర్శించారు.



బుద్ధ జయంతిని పురస్కరించుకుని జగ్గయ్యపేటలో బుద్ధవిహార్ ధ్యాన కేంద్రం సభ్యులు వారికి ధనంబోడును చూపించారు. బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు రాంబోది కాశీ, మాజీ ఏఎంసీ చైర్మన్ గింజుపల్లి రమేష్, ధ్యానరత్న వెలగపూడి లక్ష్మణరావు తదితరులు బౌద్ధారామంలో బుద్ధ భగవానుడి దంత అవశేషం నిక్షిప్తం చేశారని, 2200సంవత్సరాల నాటిదని, ఆచార్య నాగార్జునుడి మార్గదర్శ కత్వంలో బౌద్ధం వర్ధిల్లిందని వివరించారు.



హనుమజ్జయంతి ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చింతమనేని

17 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

» పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే చింతమనేని

హనుమాన్‌జంక్షన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కమిటీ నిర్వాహకులకు సూచించారు. ఈ నెల 17 నుంచి 22 వరకు స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలకు సంబంధించి ఆలయ ఈవో తారకేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పెద్దలు మంగళవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, జిల్లా అధికారులకు ఆహ్వాన పత్రికలను ఆందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి, తదితరులు పాల్గొన్నారు.

నెట్టెంను కలిసిన ఐటీ ప్రతినిధులు



జగ్గయ్యపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాంను లోటస్ టెక్నాలజీ అండ్ హెచ్‌సీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ముప్పవరపు రాఘవేంద్ర, సీఈవో చలువాది సాయి హనుమకువార్‌లు మంగళవారం ఆయన నివాసంలో కలిశారు. జగ్గయ్యపేటలో ఐటీహబ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు వచ్చిన వార్తల నేపథ్యంలో వారు నెట్టెంతో భేటీ ప్రాధాన్యతను సంతరించు కుంది. వారితో పాటు సాదినేని సుధాకర్‌రావు, న్యాయవాది అన్నెపాగ కిశోర్‌లు ఉన్నారు.



నరసింహస్వామికి చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలు

జగ్గయ్యపేటరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : వేదాద్రి గ్రామంలో యోగానంద లక్ష్మీనరసింహస్వామి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు కృష్ణానదిలో తెప్పోత్సవం నిర్వహించారు. మంగళవారం కల్యాణ గరుడోత్సవం, గజ వాహనసేవ, చక్రతీర్థం నిర్వహించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈవో సురేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై వేటు

» ఆర్టీసీ ఈయూ నేతల హర్షం

బస్‌స్టేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో అవినీతి అధికారులపై సంస్థ ఎండీ వేటు వేయటంపై ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఎండీ చర్యలతో విజిలెన్స్ విభాగంలో అవినీతి అధికారులు, సూపర్‌వైజర్ల గుండెల్లో గుబులు మొదలైందన్నారు. అవినీతికి పాల్పడిన కడప విఅండ్‌ఎస్‌వో నుంచి బాధిత కుటుంబాలను ఆదుకునేలా డబ్బులు వెనక్కు ఇచ్చేయాలని కోరారు. ఆర్టీసీలో కడప, విజయవాడ జోన్‌ల్లో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగాల్లో ఇటీవల వచ్చిన అవినీతి ఆరోపణలపై సంస్థ కమిషనర్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు పూర్తి స్థాయిలో విచారణ జరిపి, అందుకు బాధ్యులైన కడప విజిలెన్స్, సెక్యూరిటీ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినట్టు తెలిపారు. ఈ అవినీతి ఆఫీసర్‌కు మధ్యవర్తులుగా వ్యవహరించిన తొమ్మిది మంది కడప జోన్‌కు చెందిన సెక్యూరిటీ సిబ్బందిని కూడా సస్పెండ్ చేసినట్టు వివరించారు. విజయవాడ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను హెడ్ ఆఫీసుకు సరెండర్ చేశారని పేర్కొన్నారు. అవినీతికి పాల్పడిన వారిని, వారికి సహకరించిన సిబ్బంది పై ఎండీ తీసుకున్న చర్యల పట్ల ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోధరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆర్థికంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

మాధురి మృతిపై విచారణ

చందర్లపాడు, మే 13 : ఉపాధి పనుల్లో అక్రమాలపై స్పందించి ఆత్మహత్యకు పాల్పడిన అబ్బూరి మాధురి మృతిపై ఉన్నతాధికారులు స్పందించారు. డ్వామా పీడీ ఆదేశాల మేరకు ఏపీడీ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. మంగళవారం విపరీంతలపాడు గ్రామంలో పర్యటించిన ఆయన ఉపాధి కూలీలు, మాధురి కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఆమె ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. సేకరించిన సమాచారాన్ని పీడీకి వివరించి మాధురి కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. ఉపాధి పనుల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నట్టు మాధురి ఆత్మహత్య తేటతెల్లం చేసిందని బహుజన ఐకాసా అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య విమర్శించారు. మంగళవారం ఆయన మాధురి కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, తన ఆత్మహత్యకు గల కారణాలను మాధురి స్పష్టంగా చెప్పిందన్నారు. కేసును పూర్తిగా విచారించి ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.







1. తిరువూరు మండలం వావిలాల వద్ద ముళ్ల కంపలతో నిండిన ముష్టికుంట్ల మేజర్ కాలువ
2. విస్సన్నపేటలో పెద్ద చెరువు సప్లయి చానల్‌పై అక్రమ కట్టడాలు
3. చెవుటూరు మేజర్ కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

కన్నీటి వ్యథ!

» అధ్వానంగా సాగునీటి కాలువలు!

» తూడు, జమ్ముతో నిండిన సప్లయి చానెల్స్

» ఎన్ఎస్పీ కాలువల్లో ఏపుగా పెరిగిన చెట్లు

» వైసీపీ పాలకుల పాపం.. అన్నదాతకు శాపం



కట్టుబడిపాలెం తారకరామ ఎత్తిపోతల కుడి కాలువలో ఏపుగా పెరిగిన జమ్ము, తూటు కాడ

ఖరీఫ్ వేళ రైతుకు కష్టకాలం!

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న క్రమంలో సాగునీటి చెరువులకు నీటి వనరులుగా ఉన్న సప్లయి చానెల్స్, కాలువలు, ఎన్ఎస్పీ కాలువల మరమ్మతులు చేయకుంటే సాగునీటి ఇబ్బందులు తలెత్తడం ఖాయమని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితిలో కాలువలు, సప్లయి చానెల్స్, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు ఆయకట్టు చివరి భూములకు అందే పరిస్థితులు లేవు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటి రంగం పూర్తి నిర్లక్ష్యానికి గురవడంతో కాలువల్లో తూటు, జమ్మి, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పలుచోట్ల కాలువలు అధ్వానంగా తయారయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన పూడిక, జమ్మి, తూటు కాడ తొలగింపు పనులు ప్రారంభిస్తే తప్ప ఖరీఫ్ ప్రారంభానికి సవ్యంగా సాగునీరు ఆయకట్టు రైతులకు అందించలేని పరిస్థితి. తిరువూరు, మైలవరం నియోజకవర్గాల పరిధిలో ఉన్న సప్లయి చానెల్, ఎన్ఎస్పీ, ఎత్తిపోతల పథకాల కింద ఉన్న కాలువల దుస్థితిపై సమగ్ర కథనం. (ఇబ్రహీంపట్నం/తిరువూరు/మైలవరం రూరల్/విస్సన్నపేట - ఆంధ్రజ్యోతి)

మైలవరం నియోజవర్గంలో..

ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, విజయవాడరూరల్ మండలాలకు తారకరామ ఎత్తిపోతల పథకం ద్వారా పంటపొలాలకు సాగునీరు కుడి, ఎడమ కాలువల ద్వారా అందిస్తున్నారు. ప్రస్తుతం కుడికాలువపై కొండపల్లి పంపు హౌస్ నుంచి జి.కొండూరు వద్ద పంపు హౌస్ వరకు కాలువలో ఎక్కడ చూసినా జమ్మి, తూటు కాడ పెరిగిపోయింది. దీంతో సాగునీరు చివరి ఆయకట్టు భూములకు సవ్యంగా సాగని పరిస్థితి. కవులూరు, కట్టుబడిపాలెం వద్ద గుర్రాల వాగు, తొమ్మండ్రు వాగుల్లో తూటు కాడ, జమ్మి పెరిగి వరదల సమయంలో నీరు కిందకు పోకుండా పంటలను పాడుచేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పలు చెరువులకు సాగునీటి వనరులుగా ఉన్న సప్లయి చానెల్స్ సైతం ఏళ్ల తరబడి పూడిక తీతకు నోచుకోకుండా ఉన్నాయి.

● నాగార్జునసాగర్ మూడో జోన్‌లో ఉన్న చెవుటూరు, కొండపలి, జక్కంపూడి మేజర్ ఎన్ఎస్పీ కాలువ పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. చాలా చోట్ల అడుగుల ఎత్తులో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి.

● తిరువూరు మండలంలోని ముష్టికుంట్ల ఎన్ఎస్పీ మేజర్ కాలువ దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. కాలువ 2వ రెగ్యులేటర్ వెంకటేశ్వర నగరం నుంచి సుమారు 4కిమీ ముష్టికుంట్లకు, 10వ రెగ్యులేటరీ కాలువ ఖమ్మంజిల్లా ఎర్రబోయనపల్లి నుంచి మండలంలోని రాజుగూడెం మీదుగా వావిలాలకు వెళ్లే కాలువల్లో జమ్మిగడ్డి ముళ్ల కంప చెట్లతో నిండి కాలువకు నీరు వదిలితే ముందుకు వెళ్లని పరిస్థితి నెలకొంది. వావిలాల వద్ద కాలువ డ్రిప్ కూలి రెండేళ్లవుతున్నా నేటికీ మరమ్మతులు చేయలేదు. మండలంలోని పలు చెరువులకు సాగునీరు వెళ్లే సప్లయి చానల్స్ పూడిక చేపట్టలేదు.

● విస్సన్నపేట పెద్ద చెరువు సప్లయి చానెల్ ఆక్రమణలకు గురైంది. చానల్‌పై తూరలు వేసి మట్టిపోసి కట్టడాలు చేపడుతున్నారు. వరదల సమయంలో నీరు చానల్ ద్వారా చెరువులోకి సవ్యంగా వెళ్లకుండా రహదారి మీదకు వస్తున్నదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని సాగర్ కాలువలు..



అధ్వానంగా సాగర్ కాలువ

నందిగామరూరల్/జగ్గయ్యపేటరూరల్, మే 13 ఆంధ్రజ్యోతి : సాగుకు ఊపిరిపోసే సాగర్ కాలువలు మరమ్మతుల్లేక ఉసూరుమంటున్నాయి.. కాలువల్లో పూడిక చేరి కట్టలు పటుత్వం తగ్గి గండ్లు పడి ఉన్నాయి. కంప చెట్లతో నిండి అడవిని తలపిస్తున్నాయి. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మరమ్మతులు చేయకపోవడం వల్ల ఈ దుస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కాలువల మరమ్మతులు చేపడుతుందని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నా.. ఇంత వరకూ ఆదిశగా చర్యలు చేపట్టడం లేదు.

సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించినా.. సాగర్ కాలువల మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. కాలువలు మరమ్మతులకు నోచక దారుణంగా తయారయ్యాయని రైతులు విమర్శిస్తున్నారు.

నాగార్జునసాగర్ జోన్-2, జోన్-3 పరిధిలు 36కిలోమీటర్ల మేర బ్రాంచ్ కెనాల్స్ ఉండగా, వంద కిలోమీటర్ల మేర మేజర్ కాలువలు ఉన్నాయి. ఈ పరిధిలో సుమారు మూడువందల వరకూ మైనర్, సబ్‌మైనర్ కాలువలు ఉన్నాయి. వీటిలో బ్రాంచ్ కెనాల్స్‌కు లైనింగ్ పనులు జరిగి ఉండటం వల్ల పెద్దగా దెబ్బతినలేదు. మేజర్, మైనర్ కాలువల పరిస్థితి ఘోరంగా ఉంది. కాలువలపై చాలాచోట్ల భారీ గండ్లు పడ్డాయి. మైనర్, సబ్‌మైనర్ కాలువలు చాలాచోట్ల ఆక్రమణకు గురయ్యాయి. మూడు దశాబ్దాలుగా సాగర్‌నీరు రాకపోవడంతో నిరుపయోగంగా ఉన్న మైనర్, సబ్‌మైనర్ కాలువలను రైతులు ఆక్రమించి సాగుచేస్తున్నారు. జగ్గయ్యపేట మండలానికి వరప్రసాదంగా ఉన్న కాచవరం సప్లయి చానల్ ఇటీవల వరదలకు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో పంటలు రక్షించుకొనేందుకు రైతులు సొంత డబ్బులతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సప్లయి చానల్ మరమ్మతులకు 40లక్షలతో అంచనాలు రూపొందించినా ఇంతవరకూ నిధులు మంజూరు కాలేదు. మరో నెల రోజుల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాలువలు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాల్సిన జలవనరులశాఖ ఇంత వరకూ ఆ దిశగా ఆలోచనలు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలువల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అభివృద్ధికి నోచని కాచవరం సప్లయి చానల్

రసవత్తరంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

నందిగామ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : లింగాలపాడు గ్రామంలో తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. మంగళవారం నాలుగు పళ్ల జతల ఎడ్ల బండలాగుడు పోటీలను లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకటలక్ష్మీ సాయిబాబు ప్రారంభించారు. పోటీలలో ఏడు జతలు పాల్గొనగా 15 నిముషాల వ్యవధిలో 8.50 క్వింటాళ్ల బండ లాగినట్టు రైతు కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల యజమానులకు గరికపాటి భాస్కరం సోదరులు వస్త్రాలు, జ్ఞాపికలు అందజేశారు.





ఎడ్ల బండ లాగుడు పోటీలు, విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు

రెండు పళ్ల విభాగం విజేతలు

సోమవారం రాత్రి జరిగిన రెండు పళ్ల జతల విభాగంలో పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యారం గ్రామానికి చెందిన కేఎంకే బుల్స్ కడియం మణికంఠ ఎడ్ల జత మూడువేల అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.25వేలు గెలుచుకుందన్నారు. అదే విధంగా సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన కేఆర్ బుల్స్ కొప్పుల గోవర్ధన రెడ్డి ఎడ్ల జత ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 20 వేలు, గుంటూరు జిల్లా తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన జమ్మనబోయిన సుబ్రహ్మణ్యం ఎడ్లజత తృతీయ స్థానంలో నిలిచి రూ. 18వేలను, చందర్లపాడు మండలం బ్రహ్మబొట్లవారిపాలెంకు చెందిన పాలెం వెంకటేశ్వర్లు, పల్నాడు జిల్లా నరసారావుపేట మండలం రాగిపాడుకు చెందిన యద్దనపల్లి మనోజ్ చౌదరి ఎడ్లజత నాల్గవ స్థానంలో నిలిచి రూ. 15వేలను, బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం అడవిపాలేనికి చెందిన పోకల శ్రీనివాసరావు నాయుడు పద్మావతి నాయుడు ఎడ్ల జత ఐదో స్థానంలో నిలిచి రూ.12 వేలను, నందిగామ మండలం రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బట్ట కార్తికేయ ఎడ్లజత ఆరో స్థానంలో నిలిచి రూ.10 వేలను కైవసం చేసుకుంది.

కుక్కల దాడి..చూడిగేదె మృతి



జగ్గయ్యపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్జీవో కాలనీలోని డెయిరీ ఫాంలో చూడిగేదెపై కుక్కలు దాడిచేసి చంపేశాయి. పాటి బండ్ల నరేంద్ర డెయిరీఫాంలో గేదెలపై కుక్కలు తరచు దాడులు చేస్తున్నాయి. సోమవారం కుక్కలు చూడిగేదెపై దాడిచేయటంతో వెంటనే కర్రలతో తరిమికొట్టారు. గేదె మంగళవారం ఉదయం మృతి చెందింది. కుక్కల దాడిలో చనిపోయిన నాలుగోది అని నరేంద్ర వాపోయారు. వ్యయ ప్రయాసలకోర్చి గేదెలు పోషణ చేస్తుంటే కుక్కల దాడితో తీవ్రంగా నష్టపోతున్నట్టు చెప్పారు. చూడిగేదె రూ.60 వేలు పైగా ఉంటుందని కన్నీటి పర్యంతమయ్యారు. పుర పాలకసంఘ అధికారులు ఇప్పటికైనా స్పందించి గేదెలు, ఆవులను కుక్కల బారి నుంచి రక్షించాలని కోరారు.

తాకట్టు.. ఆపైన కనికట్టు!

(5వ పేజీ తరువాయి)

చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ప్రైవేటు సంస్థకు కట్టబెట్టేయాలన్న పేరుతో బ్యాంకు రుణంతో చేపట్టాల్సిన పనులను అర్ధంతరంగా ఏపీటీడీసీ ఉన్నతాధికారులు నిలుపుదల చేయించారు. దీంతో యూనిట్లు ఆధునీకరణకు నోచుకోకుండా పోయాయి. ఏపీటీడీసీ అధికారులు ఏ సంస్థకు అయితే కట్టబెట్టాలనుకున్నారో.. ఆ సంస్థ భవానీ ద్వీపాన్ని, బెర్మ్ పార్క్‌ను పరిశీలించి భవిష్యత్తులో భారీ వరద వస్తే తాము నష్టపోతామని వెనుకడుగు వేసింది. దీంతో షాక్‌కు గురైన ఏపీటీడీసీ అధికారులు ఆ సంస్థను ఎట్టి పరిస్థితుల్లో ఒప్పించేందుకు రాయితీల వర్షం కురిపిస్తూ చర్చలు జరుపుతున్నారు.

ముందుగానే కమీషన్లు దండుకుని..

వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటకాభివృద్ధికి నయా పైసా విదల్చలేదు. దీంతో అప్పట్లో ఉన్న కొందరు ఉన్నతాధికారులు విచ్చలవిడి అవినీతికి తెరలేపారు. ప్రభుత్వం డబ్బులు ఇవ్వటంలేదన్న కారణంతో.. ఉన్నతాధికారులు బ్యాంకుల దగ్గర రుణం తీసుకుందామన్న ప్రతిపాదన తెచ్చారు. దీనికోసం విజయవాడలోని భవానీపురంలో కృష్ణానది వెంబడి ఉన్న హరిత బెర్మ్‌పార్క్ 5.50 ఎకరాల స్థలాన్ని రూ.110 కోట్లకు తాకట్టు పెట్టారు. కాటేజీలను ఆధునీకరణ చేస్తామని, తద్వారా పర్యాటకులు పెరిగి మరింత ఆదాయం వస్తుందని, దాంతో అప్పు తీర్చుతామని బ్యాంకుకు తెలిపింది. బ్యాంకు కూడా గంపగుత్తగా డబ్బులు ఇవ్వకుండా ఆయా పర్యాటక యూనిట్ల వారీగా ఆధునీకరణ చేపడుతున్న కాంట్రాక్టర్లకు చేసిన పనిని బట్టి నేరుగా వారికే చెల్లింపులు చేస్తామని చెప్పింది. దీనికి అప్పటి ఏపీటీడీసీ ఉన్నతాధికారులు అంగీకరించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఎన్నికల ముందు హడావిడిగా కాంట్రాక్టర్లతో సమావేశం పెట్టి ముందుగానే పనులన్నింటికీ అప్పటి ఉన్నతాధికారులు కమీషన్లు దండుకున్నారు. ఆ తర్వాత ఎన్నికలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. బ్యాలెన్స్ పనులు ఆ తర్వాత వచ్చిన అధికారులు చేపట్టారు. కొంతకాలం నుంచి సడెన్‌గా పనులన్నింటినీ ఆపేశారు. దీంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. పనులు సగంలో ఆపివేశారని, తమ నుంచి కమీషన్లు మాత్రం ముందుగానే దండుకున్నారని, ఎంతో మెటీరియల్ ఖర్చు చేశామని, బిల్లులు చెల్లించకపోతే నష్టపోతామని అంటున్నారు.

తప్పులు సరిచేయకుండా.. ప్రైవేటీకరణ వల్ల ప్రయోజనమేమిటి ?

వైసీపీ హయాంలో చేసిన తప్పులను సరిచేయకుండా.. మళ్లీ అవే తప్పులకు ఉన్నతాధికారులు పాల్పడుతున్నారు. ఏపీటీడీసీ పాలకవర్గం ఈ దిశగా ఆలోచిస్తుంటే అందుకు భిన్నంగా ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారు. ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ ఈ అంశాలపై దృష్టి సారిస్తే.. ఉన్నతాధికారులు మాత్రం ఆయన ఆలోచనలే తప్పు అన్నట్టుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీటీడీసీ పర్యాటక యూనిట్లన్నీ లాభాలతోనే నడుస్తున్నాయి. ఇంకా పెట్టుబడి పెడితే మరిన్ని లాభాలు వస్తాయి. పైగా ఈ యూనిట్లకు ఎక్కువగా మధ్యతరగతి వర్గాలే వస్తుంటారు. బోటు రూ.100, రూము రూ.3,500లకు లభిస్తుంది. అదే ప్రైవేటు సంస్థకు ఇస్తే బోటు ధర రూ.500, రూము ధర రూ.10 వేలు నిర్ణయిస్తే పర్యాటకుల ఆదరణ ఉంటుందా? మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలు ఆదరించగలరా అన్న ఆలోచన కూడా ఉన్నతాధికారులు చేయటం లేదు.

గందరగోళం!

(5వ పేజీ తరువాయి)

ఎవరో ఒకరికి ఇచ్చే కార్డులో మీ పేరును కూడా చేర్చేందుకే అనుమతులు ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. ఒక్కరి పేరుతో అసలు బియ్యంకార్డు ఇచ్చేందుకు అనుమతులు లేవని చెప్పడం గమనార్హం.

● వివాహం చేసుకున్న అనంతరం అనారోగ్య కారణాలతో కుటుంబంలోని భార్య మరణిస్తే, ఆ తర్వాత సదరు వ్యక్తి వేరే మహిళను వివాహం చేసుకుంటే బియ్యం కార్డులో మార్పులు చేసేందుకు అనేక ఆంక్షలు పెడుతున్నారు. మొదటి భార్య చనిపోతే అందుకు సంబంధించిన మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని, పునర్వివాహం చేసుకున్న మహిళ తన మొదటి భర్త నుంచి విడాకులు తీసుకున్నట్టుగా కోర్టు ఇచ్చిన పత్రాలను సమర్పించాలని చెబుతున్నారు. అధికారుల మాటలకు రెండో వివాహం చేసుకున్న వారు ఖంగుతింటున్నారు.

● కుటుంబంలో గొడవలు జరిగి, విడిపోయిన వారు కులకట్టుబాట్లను ఆధారంగా చేసుకుని పెద్దమనుషుల సమక్షంలో తెల్లకాగితాలపై రాసిన విడాకుల పత్రాలపై సంతకాలు చేసి విడిపోయిన వారు కొద్దిశాతం మంది ఉన్నారు. పెద్దల సమక్షంలో విడాకులు తీసుకుని వేరే వ్యక్తిని వివాహం చేసుకున్న వారు బియ్యం కార్డులో తమపేరు చేర్చాలని కోరితే, కులపెద్దలు ఇచ్చిన విడాకుల పత్రాలు చెల్లుబాటుకావని సచివాలయ సిబ్బంది చెప్పడం గమనార్హం.

● హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ జరిగిన సమయంలో చదువుతూ, ఆ తర్వాత విద్యాభ్యాసం పూర్తి చేసుకుని వేరే ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు లేదా ఇతరత్రా వ్యాపారాలు చేస్తున్న వారు అధికశాతం మంది ఉన్నారు. గతంలో చేసిన హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో నుంచి వీరి పేర్లను తొలగించలేదు. వీరిలో అధికశాతం మంది పన్ను చెల్లింపుదారులుగా ఉన్నారు. తమ బిడ్డలు వివాహాలు జరిగి వేరే ప్రాంతంలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్నారని, వారి పేర్లను కార్డు నుంచి తొలగించాలని సచివాలయానికి తల్లిదండ్రులు వెళితే సచివాలయ సిబ్బంది ప్రస్తుతం తొలగించలేమని, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌ను మార్చడానికి అవకాశం ఇవ్వలేదని చెప్పడం గమనార్హం. ఇన్ని ఇబ్బందుల మధ్య కొత్తకార్డులను ఎప్పటికి ఇస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

రూరల్ పోలీస్‌స్టేషన్ భవనం ప్రారంభం నేడు



ఉయ్యూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు- కాటూరు రోడ్డులో కాకాని నగర్‌వద్ద నూతనంగా నిర్మించిన ఉయ్యూరు రూరల్ పోలీస్‌స్టేషన్ భవనాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించ నున్నట్లు ఎస్సై కె.సురేశ్‌బాబు తెలిపారు. గండిగుంటకు చెందిన సజ్జా వెంకటేశ్వరరావు విరాళం గా ఇచ్చిన 20 సెంట్ల స్థలంలో అధునాతన హంగులతో నిర్మించిన విశాలమైన భవనాన్ని హోం మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. పలువురు మంత్రులు, డీజీపీ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు తెలిపారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు ఇతర పోలీసు అధికారులు మంగళవారం ఉయ్యూరులో పర్యటించి రూరల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని పరిశీలించారు.



విజేత దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న మనోహర్, హరికృష్ణ

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో దుర్గాప్రసాద్‌కు గోల్డ్‌మెడల్

పెనమలూరు, మే13 (ఆంధ్రజ్యోతి) : మిస్టర్ ఆంధ్రా, క్లాసిక్ బాడీబిల్డింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాల నుంచి 70కిలోల విభాగంలో సీహెచ్ దుర్గాప్రసాద్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ మనోహర్, కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఈ నెల 12న టీఏబీబీఏ సహకారంతో కదిరిలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతను కోచ్ రాజు, బాడీ బిల్డింగ్ అసోసియేసన్ చైర్మన్ గొట్టిపాటి వెంకట రామకృష్ణ ప్రసాద్‌లు ఘనంగా సత్కరించారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

ఉయ్యూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ నున్న నుంచి గుడివాడ ట్రాన్స్మిషన్ లైన్ ఆధునీకరణలో సాంకేతిక మరమ్మతుల కార ణంగా పామర్రు 132 కేవీ ఒక ఫీడర్ తాత్కా లికంగా ఆపేయడం వలన బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు.

వెబ్ డెవలపర్‌పై శిక్షణ

గన్నవరం, మే 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వెబ్ డెవలపర్‌పై మూడు నెలలు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివి కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాసైన, తప్పిన విద్యార్థులు అర్హులని చెప్పారు. 16 నుంచి 35ఏళ్ల లోపు వయస్సు ఉండాలని తెలిపారు. శిక్షణ అనంతరం గుర్తింపు సర్టిఫికెట్‌తో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 94940-05725 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వర్షాలు వచ్చే లోపు కాల్వల్లో పూడిక తీయించండి

కంకిపాడు డీసీ దేవినేని రత్నభూషణ్

కంకిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు వచ్చే లోపు పంట కాలువల్లో పూడికతీయించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులను కంకిపాడు డీసీ దేవినేని రత్నభూషణ్ కోరారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో మంగళ వారం కంకిపాడు పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షు లు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాలను నిర్వీర్యం చేసిందన్నారు. పంట కాలువల పూడికతీత తీసిన దాఖలాలు లేవన్నారు. అధికా రంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుం దన్నారు. కాలువల పూడికతీత, కాలువల్లో స్ప్రేయింగ్ వంటి పనులు త్వరిత గతిన చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, వివిధ గ్రామాల నీటి సంఘాల అధ్యక్షులు కొల్లి వెంకటకృష్ణారావు, యలమంచిలి శ్రీనివాసరావు, కె. సుబ్బారెడ్డి, జి. నాగిరెడ్డి నాదెండ్ల యుగంధర్, కె. వెంకటేశ్వరరావు, తాతినేని రామ చంద్రరావు, ఇరిగేష న్ ఏఈఈ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
● రూ.13.50 లక్షలతో నిర్మించే క్రికెట్‌నెట్‌కు శంకుస్థాపన



క్రికెట్ నెట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని వెంచర్‌లో పంచాయతీ నిధులు రూ.13.50 లక్షలతో క్రికెట్ నెట్ ఏర్పాటు చేసేందుకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్ కోర్టు కూడా ఏర్పాటు చేయటం జరు గుతుందన్నారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం, శారీ రక ధారుడ్యం చేకూరుతుందన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంచు కోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలు గా సర్వనాశనం చేసిందన్నారు. యువతను చెడుమార్గాలవైపు ఆకర్షించేలా చేసిందని మండిప డ్డారు. గతంలో ఎక్కడ చూసిన గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా విక్రయాలు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో విక్రయాలు చాలా తగ్గిపోయా యని తెలిపారు. యువత సన్మార్గంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యపడు తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని చెప్పానని ఇప్పటి వరకూ 7వేల మందికి పైగా ఉపాధి చూపించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మిగిలిన నిరుద్యోగ యువతకు ఉపాధి చూపిస్తానని చెప్పారు. వీరపనేనిగూడెం, మల్లవల్లి లో కొత్త కంపెనీలు రానున్నాయని వాటిల్లో ఉద్యోగ వకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. అందరి సహకారంతో గన్నవరం ప్రధాన సెంటర్ రూపు రేఖలు త్వరలోనే మారనున్నాయని తెలిపారు. వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీలు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, ఎంపీడీవో టి.స్వర్ణలత, తహసీల్దార్ కేవీ శివయ్య, ఏడీఏ సునీల్, ఏఈ వెంకటరాజు, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, టీడీపీ నాయకులు జాస్తి శ్రీధర్, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, గూడపాటి తులసీమోహన్, కోటగిరి వరప్రసాదరావు, గుమ్మడి వెంకట్రామయ్య, యనమదల సతీష్, జాస్తి ఫణిశేఖర్, చిమట రవివర్మ, మడుపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ 10, 12 తరగతుల్లో
ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రభంజనం

ప్రసాదంపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ 10, 12 తరగతుల పరీక్షా ఫలితాల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయవాడ ప్రభంజనం సృష్టించింది. పదవ తరగతిలో నూటికి నూరుశాతం, 12వ తరగతిలో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించిందని పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్‌చంద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో శ్రేష్టకు 500కు గానూ 492 మార్కులు, అంగులూరి శృతికకు 491 మార్కులు జైత్ర శ్రీరితన్య 484 మార్కులు సాధించారని తెలిపారు. 12వ తరగతిలో తబిత శీలంకు 477 మార్కులు, నిశాంత్‌రెడ్డి 463, ఎం.జయ హర్షిణ్‌రెడ్డి 469 మార్కులు సాధించారని పేర్కొన్నారు. దేశంలో ఉన్న సీబీఎస్ పాఠశాలల్లో కో సర్కిల్ విషయాల్లోనూ జాతీయ స్థాయిలో ర్యాంకులను సాధించడమే కాకుండా అకడమిక్ పరీక్షా ఫలితాల్లోనూ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజ యవాడ ప్రత్యేక గుర్తింపు సాంపాధించుకుందన్నారు. ఇంతటి కృషి చేసిన విద్యార్థు లు, ఉపాధ్యాయులను పాఠశాల ప్రో వైస్ చైర్మన్ పరిమి నరేంద్రబాబు అభినందించారు. డైరెక్టర్ కడియాల ప్రవీణ్‌కుమార్, పాఠశాల అకమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజ్, ప్రిన్సిపాల్ భవనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు శుభాంకాంక్షలు తెలిపారు.



డివిజన్ల కమిటీల ఎంపికల్లో మాట్లాడుతున్న వెలగపూడి శంకరబాబు

టీడీపీ తాడిగడప డివిజన్ల కమిటీల ఎంపిక

పెనమలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ తాడిగడప మునిసిపాలిటీలో కీలక డివిజన్ల కమిటీల ఎంపికలు మంగళవారం పూర్తయ్యాయి. 28వ డివిజన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు, 29వ డివిజన్ అధ్యక్షుడిగా ఎండీ ఇక్బాల్, 31వ డివిజన్ అధ్యక్షుడిగా అబ్దుల్ రెహమాన్‌లు ఎంపికయ్యారు. టీడీపీ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు కార్యాలయంలో ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, టీడీపీ కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బుజ్జి, దోనేపూడి రవికిరణ్, ఇమాం, చలసాని రాము తదితరులు పాల్గొన్నారు.



దాసరి హరినీడును అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

టీడీపీ పెదపులిపాక అధ్యక్షుడిగా దాసరి హరినీడు

పెదపులిపాక టీడీపీ అధ్యక్షుడిగా దాసరి హరినీడు మంగళవారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గతంలో పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన మునునూరు శ్రీనివాస రావు నుంచి హరినీడు అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఎంపిక కార్యక్రమంలో క్లస్టరు ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోయ ఆనంద్‌ప్రసాద్, తుమ్మల రాంకుమార్, సంగెపు రంగారావు, గుజ్జర్లపూడి బాబూరావు, మునునూరి శ్రీధర్, మునునూరు నిర్మల్, పులి విజయ్, పిడికిటి శ్రీనివాస్, సింహాద్రి కృష్ణవేణి, అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే అభ్యున్నతి సాధ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : నైతికత విలు వలు, క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారా మాత్రమే జీవితంలో అభివృద్ధి చెందుతూ తోటి వారికి సహాయపడటం సాధ్యమవుతుందని గ్రంథాలయాధికారి పి. స్వర్ణలతాదేవి విద్యార్థులకు సూచించారు. వీరవల్లి గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పంచతంత్ర కథలను చదివి వినిపించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది కమలకుమారి విద్యార్థులకు చిన్ననాటి నుంచి తీసుకోవాలిసిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

గన్నవరం : విద్యార్థుల్లో సృజనాత్మ కతను వెలికితీసేందుకు పోటీలు దోహదపడతాయని గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గుమ్మడి వెంకట్రామయ్య అన్నారు. మండలంలోని పురుషోత్తపట్నంశాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కె.కృపానందం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలికల భవిష్యత్తు మెరుగుకు కిషోర వికాసం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అక్షరాస్యత, ఆరోగ్యం, సాధికారత తదితర విషయాలపై అవగాహన కల్పిస్తూ బాలికల సమగ్ర అభివృద్ధి కోసమే కిషోర వికాస లక్ష్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవాణి తెలిపారు. వీరవల్లి 1, 3 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని మహిళలకు, కౌమార దశలోని బాలికలకు కిషోర వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్య, ఆరోగ్యం, సామాజిక అసమానతలు తదితర విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆకుకూరలు లాంటి పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత రాదని, తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే లాభాలు తదితర విషయాలపై ఆరోగ్య సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ సౌదామని, కమల కుమారి, ఎంఎస్‌కె సోని, వాణి, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు, బాలికలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిధులతో బోరు ఏర్పాటు



బోరు ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ దావులూరు అధ్యక్షుడు జెల్లి కోటేశ్వరరావు

కంకిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి) : తాగునీరు సమస్య పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తక్షణ చర్యలు తీసుకోవడం హర్షణీ యమని దావులూరు టీడీపీ అధ్యక్షులు జెల్లి కోటేశ్వరరావు అన్నారు. మండలంలోని దావులూరులో తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ. 3.90 లక్షలతో బోరును ఏర్పాటు చేశారు. మంగళవారం బోరు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నిధులతో బోరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సురేష్, ఈవో జ్యోతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఖాదర్ పాల్గొన్నారు.



పెనమలూరు హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసులు రెడ్డి

విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి

పెనమలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా తీర్చిదిద్దే పనిలో ప్రతి ఉపాధ్యాయుడు ఉండాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. పెనమలూరు హైస్కూల్‌లో గత విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో మంచి ఫలితాలను సాధించిన 192మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. గ్రామసర్పంచి లింగాల భాస్కరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కిలారు శివకుమార్, రాష్ట్ర తెలుగుయువత ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రవణ్, ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని, ఉయ్యూరు ఆర్డీవో హేలాషారోన్, ఉయ్యూరు డిప్యూటీఈవో పద్మారాణి, ఎస్‌ఎంసీ చైర్మన్ ఖైరున్నీసా, గ్రామ పెద్దలు కిలారు బసవపున్నయ్య, వీర బ్రహ్మాజీ, రామ్‌కమల్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సమ్మెను విజయవంతం చేయాలి

కంకిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయా లని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి. రంగారావు అన్నారు. వివిధ ప్రజా సంఘాలతో మంగళవారం స్థానిక మండేపూడి నాగభూషణ్ రెడ్డి భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు జి. కుమారి, టి. నరేష్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు వై. నళినికుమారి, నాయకులు దుర్గా, రూప, సుందరి, బి. రాజ్యలక్ష్మి, శారద, పల్లవి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

గన్నవరం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లిలో శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణానికి గ్రామానికి చెందిన ఈడే వెంకటరత్నం జ్ఞాపకార్థం వారి మనువడు పలగాని సాత్విక్, కల్పన దంపతులు రూ.1,01,116 విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, సుమారు రూ.1.50 కోట్లతో ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాజులపాటి శ్రీనివాసరావు, మరీదు రాంబాబు, శౌంతి కిషోర్, హనుమంతరావు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న సాత్విక్, కల్పన



విభిన్న ప్రతిభావంతుడికి ట్రైసైకిల్ అందజేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ట్రైసైకిల్ పంపిణీ

పెనమలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : మంటాడకు చెందిన కోడెబోయిన నాగేశ్వరరావు అనే విభిన్న ప్రతిభావంతుడికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ట్రైసైకిల్‌ను అందజేశారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, టీడీపీ పెనమలూరు, కంకిపాడు మండల అధ్యక్షులు ఆనంద్‌ప్రసాద్, సుదిమళ్ల రవీంద్ర పాల్గొన్నారు.

ఇంటింటికీ మోదీ ఫిట్నెస్ మంత్ర



పెనమలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రతి ఇంటికి మోదీ ఫిట్‌నెస్ మంత్ర ను అందించాలని నిర్ణయించినట్లు యోగాశక్తి సాధన సమితి చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. కానూరులోని యోగాశక్తి సాధన సమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో వ్యాధులు తగ్గించడం ప్రధాని మోదీ ఫిట్నెస్ మంత్రతో సాధ్యమేనన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాల్లో భాగంగా జూన్ 1 నుంచి 21 వరకు జరిగే కార్యక్రమాల బ్రోచర్‌ను ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఆవిష్కరించడం సంతోషదాయకమన్నారు. యోగాలో పాల్గొనదలచినవారు అశోక్‌నగర్‌లోని ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు.



పుట్టలో పాలుపోసి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సైనికులకు మనోధైర్యం కల్పించాలి

● సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

మోపిదేవి, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశ సైనికులకు, త్రివిధ దళాలకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మనోధైర్యం కల్పించాలని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆకాంక్షించారు. భారత్ - పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో భారతీయులకు మనోధైర్యం కల్పించాలంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ షణ్ముఖ దేవాలయాల్లో పూజలు చేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో పూజలు చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని విశేష పూజలు చేసి నాగపుట్టలో పాలుపోశారు. అనంతరం వారికి స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు అందించారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ద్వారా ఎవరైనా భారత్ జోలికొస్తే ఏం చేయగలమో మోదీ నాయకత్వంలో త్రివిధ దళాధిపతులు నిరూపించారన్నారు. ప్రధానికి, సైన్యానికి, ప్రజలకు స్ఫూర్తినివ్వాలని పవన్ ఇచ్చిన పిలుపులో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు చేశామన్నారు.

భారీ తిరంగా ర్యాలీ

భారత సైనికులకు, త్రివిధ దళాధిపతులకు సంఘీభావంగా మోపిదేవిలో ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిఆలయం వద్ద నుంచి జాతీయ కూడలి మీదుగా బస్టాండ్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు పాల్గొని సైనికులకు సంఘీభావం ప్రకటించారు. డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, ఏపీఐఐసీ డైరెక్టర్ మండలి రాజేష్, జనసేన నేతలు మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు రాయపూడి వేణుగోపాలరావు, బచ్చు వెంకట నాథ్ ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ స్థానిక నేతలపై ఆగ్రహం!

● మోపిదేవిలో విచారణ చేపట్టిన కనపర్తి

అవనిగడ్డ, మే 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మండలానికి చెందిన నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఆదివారం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు సిద్ధం కాగా మండల, నియోజకవర్గ నేతల మధ్య ప్రధాన సెంటర్‌లో వాగ్వాదం జరిగింది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న పార్టీ అధినాయకత్వం వెంటనే విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని కనపర్తిని ఆదేశించగా ఆయన మోపిదేవిలోని ఓ హోటల్‌లో ఘటనకు బాధ్యులైన వారిని పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల అవనిగడ్డ ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావుకు, పార్టీ మండలాధ్యక్షుడు యాసం చిట్టిబాబుకు వాగ్వాదం జరిగింది. దీంతో కనపర్తి ఇద్దరినీ వివరణ కోరటంతోపాటు ఇలాంటి చర్యలు మరోమారు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు మండల నేతలతో కమిటీని నియమించి వారి నిర్దేశం ప్రకారం ఏర్పాటు చేయాలని సూచించినట్లు సమాచారం. దీనిపై కనపర్తి శ్రీనివాసరావు వివరణ కోరగా పార్టీలో అంతర్గతంగా ఉన్న చిన్న వివాదానికి సంబంధించి రెండు వర్గాల నేతలను కూర్చోబెట్టి మాట్లాడామని, త్వరలోనే ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీనిపై ఈ సమావేశంలో చర్చించామన్నారు.



నది అందాలను వీక్షిస్తున్న సందర్శకులు

సందర్శకులతో నవలంక కళకళ

నాగాయలంక, మే 13 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు రావటంతో పిల్లలతో కలిసి తల్లిదండ్రులు నాగాయలంకలోని శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్‌ని, నంది మధ్యలో ఉన్న నవలంకను పడవలో వెళ్లి సాయంకాలం వేళ సందర్శించి ప్రకృతి అందాలను వీక్షించి అమితానందాన్ని పొందుతున్నారు. నవలంకలో ఉన్న బెంచీల మీద తల్లిదండ్రులు కూర్చోగా, పిల్లలు ఇసుక తిన్నెలలో పిచ్చుక గూడులను కట్టుకుంటూ ఆహ్లాదాన్ని పొందుతున్నారు. కొంతమంది పిల్లలు ఘాట్‌లో స్నానాలు చేస్తూ వేసవి తాపాన్ని తీర్చుకుంటున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ, పర్యాటక అధికారులు నవలంకను సందర్శించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో సందర్శకులు ఈ నవలంకలో తమ పిల్లలతో తల్లిదండ్రులు వచ్చి గడపటం విశేషం.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాజా

మద్యం సేవించి ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తుల అరెస్టు

మచిలీపట్నం టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి విచక్షణ కోల్పోయి మే 4న ఏపీ 39 యుఎల్ 7744 నెంబరు గల ఆర్టీసీ బస్సు సిబ్బందిపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసినట్టు బందరు డీఎస్పీ సీహెచ్. రాజా తెలిపారు. మంగళవారం తన కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బంటుమిల్లిలో గుడివాడ డిపోకు చెందిన ఆర్టీసీ సిబ్బందిపై ముగ్గురు నిందితులు దాడి చేశారన్నారు. ఈ దాడిని చిత్రీకరిస్తున్న మహిళా కండక్టర్‌ను సైతం దుర్భాషలాడారన్నారు. ఇలా శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన సోమిశెట్టి వెంకటనారాయణ, అతడి స్నేహితులు పెందుర్రు గ్రామానికి చెందిన రాగవరపు సతీష్, దాసు శ్రీనివాస్‌లు ఆర్టీసీ బస్సుడ్రైవర్ నాగరాజుపై దాడికి దిగారన్నారు. డ్రైవర్ నాగరాజు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి ఎస్సై గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని, రిమాండ్ విధించి బందరు సబ్‌జైలుకు పంపామన్నారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి జరిపితే ఎంతటివారినైనా చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పదన్నారు.

ఆటోనగర్‌లో చెత్త దిగ్బంధం



వారం రోజులుగా లారీల్లో ఉండి పోయిన చెత్త



పది రోజులుగా నిలిచిపోయిన చెత్త తరలింపు

● ఏ రోడ్డులో చూసినా గుట్టలు.. గుట్టలే..! ● వీఎంసీ దృష్టిలో పెట్టినా దొరకని పరిష్కారం ● జిందాల్ యూనిట్ నుంచి రాని ఆమోదం

మొగల్రాజపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆసియాలో అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతమని గర్వంగా చెప్పుకునే విజయవాడ ఆటోనగర్‌ను పది రోజులుగా చెత్త సమస్య పట్టి పీడిస్తోంది. మామూలు ఆటోనగర్ నుంచి రెండు దశాబ్దాలన్నర క్రితం ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) అనే స్వతంత్ర ప్రతిపత్తి గలిగిన సొసైటీ కిందకు వచ్చినా ఇక్కడున్న అనేక సమస్యలతో పాటు చెత్త సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదు. ప్రతి రెండు మూడేళ్లకోసారి ఈ సమస్య వస్తోంది. ప్రస్తుతం 275 ఎకరాల ఆటోనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రతిరోజు దాదాపు 30 టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి అవుతోంది. ఈ చెత్తను జక్కంపూడి ఏరియాకు తరలించడానికి ఒక డ్వాక్రా సంఘానికి కాంట్రాక్టు ఇచ్చారు. వీరు ఉదయం



గుట్టలుగా పేరుకున్న చెత్త

సాయంత్రం వేళల్లో ఆరు టిప్పర్ లారీలతో చెత్తను ఎత్తి జక్కంపూడి వైపున్న డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ యార్డులు ఫుల్ అయిపోవడం, స్థానికులు అభ్యంతరాల నేపథ్యంలో చెత్తను తరలించడం ఆపేశారు. దీంతో ఈ సమస్యను ఐలా కమిషనర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జీ కొద్ది రోజుల క్రితం వీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ ఎస్ఈ, ఈఈలకు పురమాయించారు.

జిందాల్ నుంచి క్లియరెన్స్ రావడం లేదు

గుంటూరు జిల్లాలోని చెత్త నుంచి విద్యుత్‌ను తయారు చేసే జిందాల్ యూనిట్‌కు విజయవాడ గుంటూరు కార్పొరేషన్స్ నుంచి చెత్తను పంపుతున్నారు. దీనిలో భాగంగా విజయవాడ ఆటోనగర్ నుంచి కూడా చెత్తను పంపుదామని జిందాల్ ప్రతినిధులతో వీఎంసీ అధికారులు చర్చలు జరపగా అటు నుంచి సానుకూల స్పందన రాలేదు. దీంతో పదిరోజులుగా చెత్త తరలింపు నలిచిపోయింది.

వీఎంసీ కమిషనర్ దృష్టిలో పెట్టాం

● కే బాబ్జీ, జోనల్ మేనేజర్, ఏపీఐఐసీ, కమిషనర్ ఐలా

వీఎంసీ కమీషనర్ దృష్టికి తీసుకెళ్లాం. ఐలా వాహనాల్లో చెత్తను జిందాల్ యూనిట్‌కు పంపడానికి ఎస్ఈ, ఈఈలతో చెప్పారు. వారు జిందాల్ ప్రతినిధులతో మాట్లాడితే రోజువారి డిమాండ్ కన్నా అధికంగా వస్తున్న చెత్త వల్ల కొత్తగా వచ్చే చెత్తను నిల్వ చేయడానికి స్థలం లేదని చెబుతున్నారు. ఇదే విషయాన్ని మళ్లీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సమస్య పరిష్కారం కావొచ్చని ఆశిస్తున్నామన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఆర్థిక ప్రణాళిక సంఘం చైర్మన్ కుటుంబరావు తదితరులు

అన్నదాత గురించే సీఎం ఆలోచన

● మంత్రి అచ్చెన్నాయుడు

లబ్బీపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, అన్నదాతల సంక్షేమానికి నిరంతరం ఆలోచించే వ్యక్తి సీఎం చంద్రబాబు అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుఅన్నారు. బందరు రోడ్డులోని మురళి ఫార్చ్యూన్ హోటల్‌లో యానిమల్ హజ్‌బెండరీ టెక్ ఏ1 - 2.0 ఇన్నోవేషన్ కాంక్లేవ్ జీఎఫ్ఎస్‌టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ సమావేశం జరగటం మంచి పరిణామమని రాష్ట్రం సీఎం చంద్రబాబు నాయకత్వంలో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తుందని, కరోనాలో కూడా జీఎఫ్ఎస్‌టీ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల పాత్ర ఎంతో ముఖ్యమైనదని సంపద సృష్టిస్తేనే రాష్ట్రాభివృద్ధి, పేదలకి నిర్మూలన సాధ్యమవుతాయన్నారు. పశు సంవర్ధక రంగంలో ఆదాయం పెరుగుదల, ఫలితాలు పేదలకు నేరుగా చేరుతాయని తద్వారా ఆదాయ వ్యత్యాసాలు తగ్గుతాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ పశు సంవర్థక రంగంలో వినియోగించటం ద్వారా మంచి అభివృద్ధి సాధించవచ్చన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామని, పాడి పరిశ్రమ మరింత ప్రగతి సాధించేలా పశు సంవర్ధక రంగంలో కృత్రిమ గర్భోత్పత్తిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన రైతులు, పశు సంవర్ధక పారిశ్రామిక వేత్తలు, పలు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

దేశ క్షేమం కోరుతూ పూజలు

● మంత్రి నాదెండ్ల మనోహర్

ఇంద్రకీలాద్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పిన దేశ సైన్యానికి, నాయకత్వానికి దైవబలం మెండుగా ఉండాలని, సైనికుల సంకల్ప బలానికి దైవ బలం తోడుగా ఉండాలని కోరుతూ వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరపాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ క్రమంలో విజయవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానంలో మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, ఇంకా పలువురు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతో సహ విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గగుడికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా శత్రు దేశానికి తగిన గుణపాఠం చెప్పిన దేశ నాయకత్వానికి, సైన్యానికి ఇంకా బలమైన ధైర్యం, స్థైర్యం, విజయం చేకూరాలని కోరుతూ దుర్గమ్మను ప్రార్థించారు. ఈ మేరకు ప్రత్యేక సంకల్పం చెప్పి అర్చనలు చేశారు. తొలుత ఆలయానికి విచ్చేసిన నాదెండ్ల మనోహర్, హరిప్రసాద్ బృందానికి ఈవో వి.కె. శీనా నాయక్, అర్చకులు, వేద పండితులు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. వేద పండితులు, అర్చకులు దేశ రక్షణ కోసం పాటుపడుతున్న సైనికుల క్షేమం, కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలకు బలం చేకూర్చాలని, దేశ ప్రజల క్షేమాన్ని కోరుతూ ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.



మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరి ప్రసాద్ బృందానికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు అర్చకులు, వేద పండితులు

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

● దుర్గగుడి ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి, దుర్గామల్లేశ్వర దేవస్థానంలో చేపట్టిన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం సాకారం చేయాలని ఈవో వీకే శీనా నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నవగ్రహ మండపం ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలు, నూతన యాగశాల, పూజా మండపాలు అందుబాటులోకి తెచ్చేందుకు చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మల్లేశ్వరాలయం చుట్టుపక్కల పచ్చదనం పెంపొందించి, సుందరీకరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. దాత సహాయంతో నిర్మించిన యాగశాల మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పూజా మండపం 2వ అంతస్తు పైకెక్కి పరిశీలించారు. పూజా మండపం ప్లాన్ చూసి, పూర్తయిన పనుల వివరాలు తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తయ్యేలా కాంట్రాక్టర్లతో సంప్రదించి పురోగతి చూపించాలని, అభివృద్ధి పనులపై రోజువారీగా క్షేత్రస్థాయి సమీక్ష అవసరమని ఈవో శీనా నాయక్ పేర్కొన్నారు.



పూజా మండపం ప్లాన్, ఆలయ నిర్మాణాలు, అభివృద్ధి పనులను పరిశీలించిన ఈవో

పూజా మండపానికి మెట్లు ఏవీ..?

దుర్గగుడి పూజా మండపానికి మెట్లు ఏవంటూ దేవస్థానం ఈవో శీనా నాయక్ ఆలయ అసిస్టెంట్ స్థపతి షణ్ముగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దుర్గగుడి ఈవో ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పూజా మండపాన్ని ఆయన పరిశీలించారు. మండపం నిర్మాణ పనులను అధికారులు, అసిస్టెంట్ సస్థతిని అడిగి తెలుసుకున్నారు. ఆయన నిచ్చెన ద్వారా పూజా మండపం 2వ అంతస్తుకు వెళ్లారు. ఈ సందర్భంగా పూజా మండపానికి మెట్లుగానీ, ర్యాంపుగానీ నిర్మించకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెట్లు లేకుండా పూజా మండపం పైకి ఎలా ఎక్కుతారని ప్రశ్నించారు. ప్లాన్‌కు అనుగుణంగా నిర్మాణ పనులు జరగాలని భవిష్యత్తు అవసరాలు గుర్తించి పనులు చేపట్టాలని ఈవో ఆదేశించారు. ఈవో వెంట ఈఈ కోటేశ్వరరావు, అసిస్టెంట్ స్థపతి, సిబ్బంది ఉన్నారు.

సౌత్ ఏషియన్ గేమ్స్‌లో రమణయ్య సత్తా

గంపలగూడెం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ సౌత్ ఏషియన్ గేమ్స్‌లో లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో క్రీడల్లో మండలంలోని పెనుగొలను గ్రామానికి చెందిన రాళ్లచర్ల రమణయ్య మూడు బంగారు పతకాలు సాధించారు. నేపాల్‌లోని పోక్రా రంగస్థలం స్టేడియంలో ఈనెల 4నుంచి 7వరకు జరిగిన ఈ పోటీల్లో రమణయ్య పాల్గొన్నారు. ఆయన కొనేళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటూ భారతి విద్యా భవన్ జూనియర్ కళాశాలలో ఉద్యోగిగా పని చేస్తున్నారు. నేపాల్, భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్, ఆఫ్గానిస్తాన్ పాల్గొనగా ఇండియా నుంచి 45 ఏళ్ల విభాగంలో రమణయ్య క్రీడల్లో పాల్గొని పథకాలు సాధించడం విశేషం. ఈ మేరకు ఆయన్ను ఈనెల 14న పెనుగొలను, తోటమూల గాయత్రి పబ్లిక్ స్కూల్లో ఘనంగా సన్మానించనున్నారు.



మూడు బంగారు పతకాలతో రమణయ్య

రాజమార్గాల పనులకు పీఎంసీల కోసం టెండర్లు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతి ప్రధాన రాజమార్గాల పనులను వేగవంతంగా చేపట్టేందుకు వీలుగా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ) కోసం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) మంగళవారం టెండర్లు పిలిచింది. అమరావతి ప్రధాన రాజమార్గాలైన ఈ-13, ఈ-15ను రూ.750 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ఇటీవల టెండర్లు పిలిచింది. టెండర్లు కూడా ఖరారు కావస్తున్నాయి. ఈ క్రమంలో పనులను ముందుకు తీసుకు వెళ్లటానికి వీలుగా పీఎంసీలను నియమించాలని నిర్ణయించటం జరిగింది. వీరి పర్యవేక్షణలో కాంట్రాక్టు సంస్థ పనులు చేపట్టాల్సి ఉంటుంది. .

టీడీపీ నేత నిరసన ప్రదర్శన

వెలుగు కార్యాలయంలో వీవో పోస్టు భర్తీపై న్యాయం చేయాలని డిమాండ్

పెనుగంచిప్రోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల వెలుగు కార్యాలయంలో కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీ పెత్తనం కొనసాగడంపై గ్రామానికి చెందిన తెలుగు యువత నేత లగడపాటి ప్రవీణ్ ఆగ్రహంతో కార్యాలయంలోనే మంగళవారం నిరసనకు దిగాడు. గ్రామంలో వెలుగు వీవోలు 9 మంది ఉన్నారు. వీరిలో దారా భాగ్యమ్మ అనే వీవో 3 నెలల క్రితం పదవీ విరమణ చేశారు. ఎన్నిక ద్వారా ఆ స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా మండల సమాఖ్య అధ్యక్షురాలు కొందరు కార్యాలయ సిబ్బంది కలిసి ఎన్నిక జరపకుండా పదవీ విరమణ చేసిన దారా భాగ్యమ్మ కూతురు, వైసీపీ సానుభూతి పరురాలు వెంకట రమణ పేరును ప్రతిపాదిస్తూ పీడీ కార్యాలయానికి పంపారు. దీనిపై స్థానిక టీడీపీ నేతలెవరూ స్పందించకపోయినా లగడపాటి ప్రవీణ్ స్పందించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉందా లేక కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందా అంటూ నిరసనకు దిగాడు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ అయిన వీవో స్థానంలో ప్రభుత్వ నిబంధన ప్రకారం ఎన్నిక జరపాలని పట్టుబట్టాడు. గత ప్రభుత్వ హయాంలో వెలుగు కార్యాలయంపై వచ్చిన అవినీతి ఆరోపణల దృష్ట్యా దాదాపు ఏడాది కాలంగా ఏపీఎంగా ఇక్కడ పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకునేందుకు సాహసం చేయడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో సుశీల అనే సీసీ తాత్కాలికంగా ఇన్‌చార్జి ఏపీఎంగా బాధ్యతలు కొంతమేర నిర్వహిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వీవో ఎన్నిక జరిపి న్యాయం చేయాలని ప్రవీణ్ డిమాండ్ చేశారు.



టీడీపీ నేత ప్రవీణ్

నిబంధనల మేరకే హోటల్ లీజు టెండర్ ఖరారు

● ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఏసుదానం

బస్టేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో ఇటీవల పీఎన్‌బీఎస్ ఎదుట ఉన్న హోటల్, డార్మిటరీ పార్కింగ్‌కు నిబంధనల మేరకు వేలం నిర్వహించినట్టు ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణ అధికారి వై.ఏసుదానం తెలిపారు. మంగళవారం ఆయన బస్టేషన్‌లోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బస్టేషన్ ముందున్న హోటల్, డార్మిటరీ పార్కింగ్‌కు (బాలాజీ హోటల్) మార్చి 15న లీజు టెండర్ ప్రకటించినట్టు చెప్పారు. అదే నెల 24న ఓపెన్ చేయగా, పాటలో 17 మంది పాల్గొన్నారు. వీరిలో శ్రీనివాసరెడ్డి అధిక ధర రూ.54లక్షలు కోట్ చేయటంతో ఆయనకు టెండర్ ఖరారు చేసి మార్చి 23న అప్పగించారు. నిబంధనల మేరకు సకాలంలో డిపాజిట్లు చెల్లించకపోవటంతో ఏప్రిల్ 15న ఆర్డర్‌ను రద్దు చేశామని, వేలం పాటలో శ్రీనివాసరెడ్డి తరువాత రూ.45లక్షలకు కోట్ చేసిన సురేష్‌ను పిలిపించి ఆయనతో మాట్లాడితే కేవలం తాను కోట్ చేసిన ధరకు రూ.500లు పెంచారని, అంతకంటే ఎక్కువ పెంచలేదని, రాతపూర్వకంగా తెలియపరిచినట్టు చెప్పారు. తరువాత కోట్ చేసిన శ్రీనివాస్‌తో మాట్లాడగా నెలకు రూ.46,01,970 ఆర్టీసీకి చెల్లించేందుకు అంగీకరించటంతో ఆయనకు టెండర్ ఖరారు చేసినట్టు చెప్పారు. లీజు కాలపరిమితి ఐదేళ్లని, 3, 4 ఏళ్లకు సంస్థ నిబంధనల ప్రకారం అద్దె పెంచనున్నట్టు తెలిపారు. ఈ టెండర్ వ్యవహారంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, నిబంధనల మేరకే జరిగినట్టు వివరించారు. కాగా, బస్టేషన్ ప్రాంగణంలో వేసవిలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 18 కూలర్లు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. ప్రాంగణంలో భద్రతను మరింతగా పెంచామన్నారు. మొత్తం 70 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు.

ప్రెస్ అకాడమీ ద్వారా జర్నలిస్టులకు శిక్షణ

● ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్

గాంధీనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగా జర్నలిజంలోకి వస్తున్న వారికి అకాడమీ ద్వారా శిక్షణ నిర్వహిస్తామని సి.రాఘవాచారీ ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్, సామ్నా నేతలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల్లో వృత్తి నైపుణ్యం పెంచేందుకు కృషి చేస్తానన్నారు. వర్కింగ్ జర్నలిస్టుగా ఉన్న వ్యక్తిని ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంపై యూనియన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడం ద్వారా పూర్తిస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేయాలని కోరారు. ఐజేయూ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కే.బాబు, యూనియన్ అర్బన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కే. జయరాజ్, డి.నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్. రమణారెడ్డి, నగర అధ్యక్షుడు ఏం వీ సుబ్బారావు, యూనియన్ నేతలు జి.రఘురామ్, శివరామ కృష్ణ, అహ్మద్ హుస్సేన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆలపాటిని సత్కరిస్తున్న యూనియన్ నేతలు

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భారతీనగర్, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు పొందటానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటిఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 24లోపు తమ దరఖాస్తులను పూర్తి చేసుకోవాలన్నారు. 8, 10వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 94906 39639 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 470

పీఎం కిసాన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ కింద లబ్ధి పొంది మధ్యలో ఆగిపోయిన రైతులు మరలా దరఖాస్తు చేసుకోవచ్చునని ఏవో బోలెం అనంతలక్ష్మీ మంగళవారం తెలిపారు. పీఎం కిసాన్ కింద మధ్యలో ఆగిపోయిన రైతులు ఆధార్ జిరాక్స్, పాస్ బుక్ జిరాక్స్ ఆధార్ కేంద్రాల్లో అందజేయాలని తెలిపారు. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను రైతులు నమోదు చేయించుకోవాలన్నారు. అన్నదాన సుఖీభవ పథకం కింద 10 అంకెల విశిష్ట సంఖ్యను నమోదు చేసుకుంటే రైతులకు అన్ని ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.

విద్యుత్‌కు అంతరాయం నేడు

పామర్రు, మే 13 (ఆంధ్రజ్యోతి): పామర్రులోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ సాంకేతిక మరమ్మతుల దృష్ట్యా 14తేదీ ఉదయం ఆరుగంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాను అత్యవసర పరిస్థితుల్లో నిలుపుదల చేయనున్నట్టు పామర్రు డీఈఈ సుందరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

పామర్రు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడులైన పదో తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా విద్యార్థులను దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం వారికి ప్రోత్సాహక నగదు బహూమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

తటాకంలా తాడంకి అండర్‌పాస్

● నిత్యం గోతుల్లో పడి గాయాలపాలవుతున్న ద్విచక్ర వాహనదారులు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పమిడిముక్కల) : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో తాడంకి సమీపంలోని అండర్‌పాస్‌లో వర్షపునీరు నిలచి చెరువులా తయారైంది. దీంతో వాహనదారులు రాకపోకల సమయాల్లో పడరాని పాట్లు పడాల్సి వస్తుంది. అండర్‌పాస్‌లో పల్లంగా ఉండటంతో కొద్దిపాటి వర్షానికే వర్షపునీరు రహదిరిపై వరదలా ప్రవహిస్తుంది. దీనికితోడు అండర్‌పాస్‌లో ఏర్పడ్డ భారీ గోతుల్లో సైతం వర్షం నీరు నిలచిపోతుంది. దీంతో ఏది గోతో, ఏదీ రహదారో తెలియక వాహనచోదకులు రోడ్డు ప్రమాదాల భారీన పడక తప్పడం లేదు. ఉయ్యూరు వైపు నుంచి మంటాడ మీదుగా పమిడిముక్కల, ఉయ్యూరు, పెదపారుపూడి మండలాల గ్రామాల కు ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలపై వెళ్లేందుకు ఇదే దారికావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి అండర్‌పాస్‌లో వర్షపునీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతు న్నారు.

వర్షపునీరు పోయే మార్గమే లేదు

తాడంకి వద్ద జాతీయరహదారిపై ఉన్న అండర్‌పాస్‌లో వర్షపునీరు పోయే మార్గం లేదు. అండర్‌పాస్ పల్లంగా ఉండటం వల్ల చిన్నపాటి వర్షానికే వర్షపునీరు నిలిచి చె రువులా ఉంటుంది. దీంతో నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురవక తప్పడం లేదు.

జాన్ భాషా, సాయిపురం సర్పంచ్



తాడంకి వద్ద అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

గోతుల్లో వాహనాలు ఇరుక్కుపోతున్నాయి

అండర్‌పాస్‌లో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో మోటారు సైకిళ్ల చక్రాలు గోతుల్లో ఇరుక్కుపోతున్నాయి. దీంతో రాకపోకల సమయాల్లో నానావస్థలు పడాల్సి వస్తోంది.

శేషవరప్రసాద్, జబర్లపూడి సర్పంచ్

ఇంటి స్థలం కోసం దరఖాస్తుల ఆహ్వానం

కూచిపూడి, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అందరికీ గృహాల పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలాలు పొందటానికి అర్హులైన ప్రతి ఒక్కరూ ఆయా గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తహసీల్దార్ మస్తాన్ తెలిపారు. తెల్లరేషన్ కార్డుదారుడు అయ్యి ఉండాలన్నారు. దరఖాస్తు దారునికి ఎక్కడా సొంత ఇల్లు కానీ, సొంత స్థలం కానీ ఉండరాదన్నారు. గతంలో గృహనిర్మాణ పథకంలో లబ్ధి పొందని వారై ఉండాలన్నారు. అలాగే నూతనంగా రేషన్ కార్డు పొందటానికి, రైసు కార్డులో మార్పులు, చేర్పులు వంటి సేవలు పొందటానికి గ్రామ సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఈ అవకాశాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

బంగారు మంగళసూత్రం చోరీ

గుడివాడ, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు యువకులు చాకచక్యంగా వృద్ధురాలి మెడలోని బంగారు మంగళ సూత్రాన్ని కాజేసిన సంఘటన మంగళ వారం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక మరీదువారి వీధికి చెందిన వృద్ధురాలు కల్యాణం లక్ష్మీసామ్రాజ్యం స్థానిక బంటుమిల్లి రోడ్డులోని బ్యాంకు వద్ద ఉండగా ఒక యువకుడు వచ్చి మైక్‌లు, టీవీల ద్వారా బంగారు నగలు ధరించి బయటకు రావద్దని ప్రచారం చేస్తున్నారని బెదిరించాడు. వెంటనే తమ ఆఫీసర్‌ను కలవాలని వృద్ధురాలికి సూచించాడు. మరో యువకుడి వద్దకు రాగానే బంగారు వస్తువులను ఒంటిపై ధరించడం తప్పుఅని, వెంటనే తీసేయమని చెప్పాడు. 3.5కాసుల బంగారు మంగళసూత్రాన్ని తీసుకుని కవర్‌లో పెట్టి, సంచిలో పెడుతున్నట్టు నటించి కాజేశాడు. కొద్ది దూరం వెళ్లి చూసుకోగా మంగళ సూత్రం కనిపించలేదు. వెనుతిరిగి చూడగా అప్పటికే యువకులు పరారయ్యారు. దీంతో వృద్ధురాలు తాను మోసపోయానని తెలుసుకుని లబోదిబోమని రోదించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై శేషకుమార్ తెలిపారు.



బాధిత వృద్ధురాలు
కల్యాణం లక్ష్మీసామ్రాజ్యం

టిడ్కో లబ్ధిదారులను రుణ విముక్తుల్ని చేయాలి

● అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షురాలు రంగమ్మ

గుడివాడ, మే 13 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెనిండ్ల రాము ఇచ్చిన హామీ మేరకు రుణవిముక్తులను చేయాలని అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షురాలు సంబంగి రంగమ్మ డిమాండ్ చేశారు. మల్లాయిపాలెం శివారు టిడ్కోకాలనీలో మంగళవారం టిడ్కోకాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడ్కోకాలనీలో మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఉప్పునీటి బోర్లు వేయించాలని కోరారు. ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా మంచినీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీన కార్మికసంఘాల ఆధ్వర్యంలో జరుగు దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మేరమ్మ, ఇందిర, ఆర్.శివరాంప్రసాద్, సహాయ కార్యదర్శులు గణేష్, షేక్ సుభాని, ఎస్.రాంబాబు, అప్పలనాయుడు, శాంతారాం, అమ్మాజీ, గాయత్రి, లక్ష్మీ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న టిడ్కో లబ్ధిదారులు



నన్నపనేనికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ఘనంగా నన్నపనేని జన్మదినోత్సవం

కూచిపూడి, మే 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర జన్మదిన వేడుకలను పెడసనగల్లులో కూటమి నేతలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యంకి, కూచిపూడి గ్రామాల్లో అభిమానులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అయ్యంకి నుంచి పెడసనగల్లు వరకు యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామర్రులోని కూటమి నేతలు లింగమనేని రామలింగేశ్వరరావు, మట్టా నందిని, తాతినేని పూర్ణచంద్రరావు, పీఎస్‌డీ చంద్రహాస్, యద్దనపూడి రాగశేఖర్, రాజులపాటి పెద్ద మస్తాన్, అయ్యంకి జయరాజు, ఈడే రవికుమార్, తాతా ప్రభాకర్‌రావు, తాతా దుర్గాప్రసాద్, పెదపూడి సందీప్, మోటుపల్లి సుబ్బయ్య, అంజిరెడ్డి, శ్రీధర్, లింగమనేని బాబురావు, పామర్రు నియోజకవర్గ పరిధిలోని నన్నపనేని యువసేన అభిమానులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, మే 13(ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ విడుదల చేసిన 10వ,12 తరగతుల పరీక్షా ఫలితాల్లో స్థానిక విశ్వభారతి వైజ్ వుడ్స్ నూరు శాతం ఫలితాలను సాధించి విజయదుందుబి మోగించిందని విద్యాసంస్థ చైర్మన్ పొట్లూరు శ్రీమన్నారాయణ తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో బి.రోహిత్‌సాయి 487/500 మార్కులు, 12వ తరగతి ఫలితాల్లో బి.మంజునాథ్‌రెడ్డి 454/500 మార్కులతో ప్రథమ స్థానాల్లో నిలిచినట్టు ఆయన పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులను పాఠశాల డైరెక్టర్లు ఆర్.మంజుల, ఆర్.ప్రణీత్, తదితరులు అభినందించారు.



మంజునాథ్‌రెడ్డి
12వతరగతి



రోహిత్‌సాయి
10వతరగతి

విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం

పామర్రు : విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయని జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం పిల్లలకు నీతి కథలు బోధించడంతో పాటు ఆత్మ విశ్వాసంతో భవిష్యత్తులో ముందుకు ఎలా సాగాలో వివరించారు. జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి.నాగసురేష్, మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవిలు పాల్గొని గ్రంథాలయ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

ప్రత్యేక పూజలు

పామర్రు : స్థానిక ఉంగ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద వేం చేసి ఉన్న వీరాంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు పాలపొంగళ్లు సమర్పించి స్వామికి ఆకు పూజలు జరిపించారు. ఆలయాధికారి ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ఫణిశర్మ, బేతనబోట్ల సుబ్బారావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దాతలు సమర్పించిన పులిహోరాలను పంపిణీ చేశారు.

రైతులు ఆయిల్‌పామ్ సాగుపై మక్కువ చూపాలి

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, మే 13 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే ఆయిల్‌పామ్ సాగు పట్ల మరింతగా రైతులు మక్కువ చూపాలని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. మంగళవారం కురుమద్దాలిలో జిల్లా ఉద్యానవనవశాఖ, ఉండవల్లి ఆగ్రోస్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా వెలగపూడి సాంబశివరావుకు చెందిన దాదాపు 20 ఏకరాల్లో ఆయిల్‌పామ్‌సాగుకు ఎమ్మెల్యే చేతుల మీదగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు కురుమద్దాలి గ్రామం ఆదర్శంగా నిలువబోతుందన్నారు. ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు నూరుశాతం రాయితీపై హెక్టారుకు రూ.29వేలు విలువగల 143 ఆయిల్ మొక్కలను రాష్ట్రప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాలు వల్ల ఆయిల్ పంట సాగుకు ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశంలేదన్నారు. కూలీల అవసరం చాల తక్కువగా ఉంటుందని రైతులు గ్రహించాలన్నారు. పామాయిల్ సాగుకు పామర్రు మండలం అనుకూలమైన వాతావరణం ఉందనిరైతులు ఈసాగుపట్ల అసక్తి కనబరిచి లాభాలు గడించాలన్నారు. ఉండవల్లి ఆగ్రోస్ ఏజీఎం గరికపాటి శ్రీనివాస్ ఆగ్రోస్ డీజీఎం హరికృష్ణ పామర్రు డీసీ చైర్మన్ కోసరాజు వెంకటేశ్వరరావు ఉద్యానవన శాఖ ఏవో కీర్తి, పాల్గొన్నారు.

కురుమద్దాలిలో ప్రగతిపథం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పల్లె నిద్ర చేశారు. అనంతరం మంగళవారం పల్లెనిద్రను ముగించుకుని వేకువజామున గ్రామంలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పుల్లేటి కాల్వగట్టు రహదారి సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నామని రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని బీసీ కాలనీ వాసులు కోరారు. ఎస్సీకాలనీ చెట్లవద్ద రేడియోగది పున్నర్నించాలని కోరారు. గ్రామంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్రెయినేజీ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. ప్రధాన సమస్యగా ఉన్న పక్కా డ్రెయినేజీలను ఆరునెలలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఉపాదిహామీ పథకం పనుల్లో కూలీలతో కలసి కొంతసేపు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోట్రు విజయభారతి, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, గ్రామ టీడీపీ నేతలు మండవ వెంకటకృష్ణారావు, పామర్రు డీసీ చైర్మన్ కోసరాజు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న
ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

బీరువా, ల్యాబ్ పరికరాల వితరణ

గుడివాడ, మే 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎస్‌జీఆర్‌కే(టౌన్) మున్సిపల్ ఉన్నత పాఠశాలకు శ్రీకృష్ణయాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో ఉప్పల వెంకటేశ్వరరావు 4వ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం కుమారులు ప్రద్యుత్ బాబు రూ.25వేలు విలువగల సైన్స్ ల్యాబ్ పరికరాలు, రెండు బీరువాలను వితరణగా అందజేశారు. మంగళవారం స్థానిక పాఠశాలలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు చేతుల మీదగా అందజేశారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్, మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గరావు, శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ అధినేత పల్లపోతు వెంకటనాగబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.ఎన్. శ్రీనివాసన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వీరజవాన్‌లకు ఘన నివాళులు

గుడివాడ, మే 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పట్టణంలో బుద్ధ పూర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి బంటుమిల్లి రోడ్డులోని బౌద్ధస్తూపం వరకు చేపట్టిన ర్యాలీని మంగళవారం ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరజవాన్‌లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తూర్పుకృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ గుత్తా చంటి, పిరమిడ్ రాజకుమారి, ఆదిమాంధ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజు, పిన్నమనేని వేణుగోపాలరావు, జిల్లా బౌద్ధ ప్రాజెక్టు డైరెక్టర్ రామకృష్ణ, దినకర్, టీడీపీ నాయకులు, అంబేద్కరిస్టులు, బౌద్ధ అభిమానులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తత తప్పనిసరి

గుడివాడ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వస్తున్నందున గ్రామాల్లో మహిళా పోలీసులు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించుకోవాలని తెలిపారు. ప్రతీ మహిళా పోలీసు వారి పరిధిలో గ్రామాల వారీగా ఎటువంటి దొంగతనాలు జరుగకుండా చూడాలన్నారు. వేసవికాలం లో దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని, వీటిపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మహిళా పోలీసు గ్రామాల్లో అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉండి సమాచారాన్ని తెలుసుకుని స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ పోలీసులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

● జిల్లా లీగల్ అధికారిణి వి. శైలజ

కూచిపూడి, మే 13 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా లీగల్ కం ప్రొబిషన్ అధికారిణి వి.శైలజ పేర్కొన్నారు. కిశోర వికాసం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా కాజ-7 అంగన్వాడీ కేంద్రంలో 15 నుంచి 18 సంవత్సరాల లోపు పిల్లలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆపద సమయాల్లో ఎవరికి పిర్యాదు చేయాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుణ్యవతి, సిహెచ్.ఉషారాణి, కె.రాజ్యలక్ష్మి, రజిత రాణి, రజిత, శారద తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల : బాలికల రక్షణకు అమల్లేస్తున్న పోక్సో చట్టం, అమలులో ఉన్న చట్టాలపై అవగాహన అవసరమని ఎంఎస్‌కే శ్రవంతి అన్నారు. కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం కపిలేశ్వరపురం గుర్రాలంక అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని బాలల హక్కులు, బాలల రక్షణకు చట్టాలు, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించి వీడియో ప్రదర్శించారు. ఏఎన్ఎం డీవీ లక్ష్మీ, ఆశావర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



పమిడిముక్కలలో..

పెదపారుపూడి: కిశోర వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేసిందని అంగన్వాడీ సూపర్‌వైజర్ అరుణ కుమారి అన్నారు. మంగళవారం దూళ్లవానిగూడెం అంగన్వాడీ సెంటర్‌లో కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతీ సచివాలయం నుంచి ఐదుగురితో గ్రూపు సభ్యులను ఏర్పాటు చేశామన్నారు. అన్ని సచివాలయాల్లో 15 నుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న బాలికలను యాప్‌లో వారి పేరు నమోదు చేసుకుని ప్రతీ మంగళ, శుక్రవారాలు తప్పనిసరిగా అవగాహన కార్యక్రమాలకు హజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా, సచివాలయ వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నందివాడ: పెదలింగాల అంగన్‌వాడీ కేంద్రం వద్ద సూపర్‌వైజర్ నాగ శిరీష ఆధ్వర్యంలో కిశోర వికాసం - వేసవి శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్టు అంగన్వాడీ టీచర్ జి.వెంకటేశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా నాగ శిరీష మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణ పీవోసీఎస్‌ఓ చట్టం , గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ బి.లక్ష్మీ అనూష, అంగన్వాడీ టీచర్ చిట్టెమ్మ, ఏఎన్ఎం లక్ష్మీ, వీవోఏ సీహెచ్.రాజ్యలక్ష్మి, గ్రామస్థులు పాల్గొన్నారు.



కూచిపూడిలో..



పెదపారుపూడిలో..

మచిలీపట్నం

కోడూరు అవుట్ ఫాల్ స్లూయిజ్ పనులు చేపట్టాలి

కోడూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): కోడూరు అవుట్ ఫాల్ స్లూయిజ్ పునర్నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అవుట్ పాల్స్ గేట్లు తుప్పు పట్టి విరిగి పోవటంతో కృష్ణానది నుంచి సముద్రపు ఉప్పునీరు నేరుగా పంట పొలాలలోకి చేరుతుందని ఆందోళన చెందుతున్నారు. ఉప్పునీరు నేరుగా పంట పొలాల్లోకి చేరడం వల్ల ఈ సంవత్సరం నారుమడి దశలోనే పొలాలు రెండుసార్లు ముని గాయన్నారు. గతంలో తాత్కాలిక ఫైబర్ గేట్లు ఏర్పాటు చేస్తానని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఫైబర్ గేట్లు అయినా వెంటనే అమర్చి ఉప్పునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పెడన ఎంపీడీవోగా అరుణకుమారి



పెడన రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి అధికారిణిగా ఎ. అరుణకుమారి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అవనిగడ్డలో ఈవో పీఆర్డీగా పనిచేస్తూ పదోన్నతిపై పెడన ఎంపీడీవోగా నియమితులయ్యారు. వేసవిలో గ్రామాలలో తాగునీటి సమస్యలు రాకుండా చూస్తానన్నారు. ఉద్యోగులు, పాలక వర్గంతో కలిసి మండలాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఏవో శిరీష, సీనియర్ అసిస్టెంట్‌విజయకుమారి, కేశవరావు, విజయకుమారి, సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవోకు సాదరంగా ఆహ్వానం పలికారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

నాగాయలంక, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఉపాధి పథకం ద్వారా పంట బోదులు, పొలంలో నీటి కుంటల పనులను కూలీలు చేస్తున్నారు. మండలంలోని 22 పంచాయతీలలో మంగళవారం 5600 మంది ఉపాధి కూలీలు పనులను చేశారు. 286 పనులకు గాను సుమారుగా రూ.80 లక్షల ఖర్చుతో కూడిన పనులు చేశారు. ఈ పనులను ఏపీవో టి.వి.ఎన్.ముత్యాలు పర్యవేక్షించారు.

పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

చల్లపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో జి.సాయిసింధు పేర్కొన్నారు. మంగళాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు జనుము, జీలుగ విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. తొలివిడతగా 89 క్వింటాళ్ల జీలుగ, 55 క్వింటాళ్ల జనుము విత్తనాలు రాగా, గ్రామాల్లో రైతులకు 50శాతం సబ్సిడీపై పంపిణీ చేయనున్నట్లు ఏవో తెలిపారు. పిల్లిపెసర విత్తనాలు రావాల్సి ఉందన్నారు. సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, వీఏవో పి.దుర్గామల్లేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఘంటసాల : ఘంటసాలలోని రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ జీలుగ విత్తనాలు ఒక కేజీ పూర్తి ధర రూ.123లు కాగా, రాయితీ పోనూ రూ.61.50పైసలుగా ఉందన్నారు. జనుము విత్తనాలు రూ.54.50లకు, పిల్లిపెసర విత్తనాలు సబ్సిడీ పోనూ రూ.90లకు అందిస్తున్నట్టు తెలిపారు. విత్తనాలు కావల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు నకలుతో ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ చిన్నా, సర్పంచ్‌లు మద్దాలి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



వైభవంగా రథోత్సవం

ఘంటసాల, మే 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో పూజలందుకుంటున్న రాజ్యలక్ష్మీ, భోగ లక్ష్మీ సమేత శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి రథోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి గ్రామ పురవీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించారు. తొలుత దేవాలయంలో నిత్యహోమం, బలిహరణ, తీర్థ ప్రసాదాల వినియోగం, రథాంగ హోమం, బలిహరణ కార్యక్రమాలు వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలను ఆలయ డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



పాడి రైతులకు పశువుల దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

పెడన రూరల్ / పెడన, మే 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీతో అందిస్తున్న పశుదాణాను పాడి రైతులు సద్వినియోగం చేసుకుని ప్రయోజనం పొందాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన పాడిరైతులకు 50 శాతం రాయితీతో పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశువుల దాణా ఇస్తున్న విషయాన్ని అందరికీ తెలియజేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. పశుసంవర్ధక శాఖ ఏడీఏ కొనకళ్ల బాబూరావు మాట్లాడుతూ పెడనకు 16.3 మెట్రిక్ టన్నుల పశుదాణా వచ్చిందన్నారు. 50కేజీల దాణా బస్తా రూ. 1100లు కాగా 50 శాతం రాయితీని అనుసరించి రూ.550కి అందిస్తున్నామన్నారు. ఎఫ్‌సీ పాడి రైతులకు 6.3 మెట్రిక్ టన్నులకు, ఇతర పాడి రైతులకు 10 మెట్రిక్ టన్నులు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఏడీఏ వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకటనగేష్, టీడీపీ నాయకులు శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అన్న ప్రసాదం తయారీని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యం

సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

మోపిదేవి, మే 13 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో భక్తులకు అందించే సేవలు నిరంతరం మెరుగుపరుస్తూ ఉండాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం దేవస్థానంలో నిత్యాన్నదానం వంటశాల, దేవస్థానం నిధులు రూ.2.75 కోట్లతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్, కాటేజీ పనులను దేవస్థానం అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ దేవాలయానికి విచ్చేసే భక్తులకు ఎక్కడా రాజీ పడకుండా నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. దేవస్థానానికి చెందిన కోనేరు ప్రాంగణంలో దేవస్థానం నిధులతో నిర్మిస్తున్న విశ్రాంతి గదులు, షాపింగ్ కాంప్లెక్స్ పనులు నాణ్యతతో జరగాలన్నారు. నిర్మాణ పనులు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ అందుబాటులోకి త్వరగా తీసుకురావాలన్నారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, సహాయక ఉద్యోగులు ఆయన వెంట ఉన్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు

నాగాయలంక, మే 13 (ఆంధ్రజ్యోతి): భావదేవరపల్లిలో కొలువైన శ్రీదేవి, భూదేవి, రాజ్యలక్ష్మీ సమేత భావన్నారాయణస్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి జరిగిన కల్యాణ మహోత్సవాలు మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్ల పవళింపు సేవలతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ అర్చకులు పంచాంగం రమణాచార్యులు, శ్రీనివాసరావు, ఆలయ ఈవో సీహెచ్.సుధాకరరావు, ఆలయ ధర్మకర్త బోగాది విశ్వేశ్వరరావు, గ్రామ పెద్దలు, సిబ్బంది పర్యవేక్షించారు.

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు



అవనిగడ్డ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): వేకనూరులోని మాదివాడ అంకాలమ్మ అమ్మవారికి, పోతురాజు స్వామి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి, ఎమ్మెల్యే తనయుడు - కోడలు మండలి వెంకట్రామ్ - సాయి సుప్రియ, కుమార్తె - అల్లుడు శీలం కృష్ణ ప్రభ - శీలం అశ్విన్ కుమార్ దంపతులు కుటుంబ సమేతంగా విచ్చేసి ప్రత్యేక పూజలు జరిపారు. కమిటీ పెద్దలు, అర్చకులు వారిని ఘనంగా సత్కరించి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు.

అశ్వారావుపాలెంలో హనుమాన్ చాలీసా

అవనిగడ్డ రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపాలెంలోని కోదండ రామాలయంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం మంగళవారం నిర్వహించారు. అవధూతేంద్ర భక్త మండలి భజన సమాజం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రసన్నాంజనేయస్వామికి 11 రకాల పిండి వంటలు, గారెల దండలతో రోజుకు ఇద్దరు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

మచిలీపట్నం టౌన్ : పరాసుపేటలోని సువర్చలా సమేత ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామికి వడమాలలు, అప్పాల మాలలు, తమలపాకు దండలు, తులసి మాలలతో అలంకరించారు. భజన బృందాలు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి తిక్కిశెట్టి మోహనరావు పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా శ్రీ చక్రస్నాన మహోత్సవం

అవనిగడ్డ, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ చక్రస్నానం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కల్యాణకర్తలు పోతురాజు పవన్ కుమార్ - సుమిత్ర దంపతులు శ్రీమాన్ దీవి పార్థ వెంకట రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నిత్య హోమం, బలిహరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్చక స్వాములు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ధర్మకర్త పోతరాజు భాస్కరరావు, ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాల కార్మిక వ్యవస్థను నిరోధించాలి

చల్లపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలను నిరోధించటంతోపాటు 14 సంవత్సరాలలోపు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపి చదివించేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని చల్లపల్లి సచివాలయం - 1 మహిళా సంరక్షణ కార్యదర్శి వేమూరి లావణ్య పేర్కొన్నారు. కిశోర వికాసం వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా స్థానిక పార్వతమ్మతోటలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం బాలల హక్కుల రక్షణ, పోక్సో చట్టం పరిధిలో వచ్చే వివిధ అంశాలు, పరిణామాలపై అవగాహన కల్పించారు. ఏఎన్ ఎం ఝాన్సీ, అంగన్వాడీ టీచర్లు గంగాభవాని, ఈశ్వరి, శివసాయికుమారిలు పాల్గొన్నారు.

ఘంటసాల : దేవరకోటలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా వేసవి శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి కిశోర బాలల హక్కుల గురించి, బాల్య వివాహాలు, సోషల్ మీడియా పట్ల ఎలా జాగ్రత్త కలిగి ఉండాలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఐసీపీఎస్ నుంచి సీహెచ్.నాగభవాని, ఈ.చంద్రమ్మ, జీఎంఎస్‌కేలు మాధురి, రాజ్యలక్ష్మీ, ఏఎన్‌ఎం రాణి పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందిపై దాడి చేసిన ముగ్గురి అరెస్టు

బంటుమిల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి యూనియన్ బ్యాంకు సెంటర్లో ఆర్టీసీ బస్సు డ్రైవర్, మహిళా కండక్టర్‌పై జరిగిన దాడిలో ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా బంటుమిల్లి మెజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్ విధించారు. ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం బంటుమిల్లి నుంచి గుడివాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును ఆపి ముగ్గురు వ్యక్తులు డ్రైవర్, మహిళా కండక్టర్‌ను అసభ్యకరమైన పదజాలంతో తిట్టి కొట్టారు. డ్రైవర్ మద్దా నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ నెల 13వ తేదీన అరెస్టు చేసి బంటుమిల్లి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించి, బందరు సబ్ జైలుకు తరలించారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేసిన వారు ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు.



శివరామప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి కొల్లు

మచిలీపట్నం టౌన్ : అకాల మరణం చెందిన టీడీపీ కార్యకర్తల భౌతిక కాయాలను మంగళవారం రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక శివగంగలో నివసిస్తున్న మేకా శివరామప్రసాద్, బందరుకోటలో నివసిస్తున్న పాస్టర్ అబ్రహాం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రితో పాటు టీడీపీ నాయకులు పిప్పళ్ల కాంతారావు, బచ్చుల అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా



మచిలీపట్నం టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర నాయకులు సీసీఎస్ పాలక మండలి సభ్యులు ఎస్. అనంతరాములు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ మచిలీపట్నం ఆర్టీసీ జిల్లా కార్యాలయం వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సంఘ జిల్లా నాయకులు నాగిరెడ్డి, కె.వి. రావు, ఆవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తినుబండారాలు అందించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ట్రైనీ అధికారి సింధు

మచిలీపట్నం టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : హోటళ్లలో స్వచ్ఛమైన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందించాలని జాతీయ ఆహార భద్రతా సంస్థ పక్షాన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న ట్రైనీ అధికారి సింధు అన్నారు. చిత్రకళా సంసద్‌లో మంగళవారం మచిలీపట్నం కోడూరు, అవనిగడ్డ, చల్లపల్లి ప్రాంతాలకు చెందిన ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ సెంటర్లు, హోటళ్ల యజమానులు, బిర్యానీ పాయింట్‌లు, టీ షాపులు, కర్రీ పాయింట్ల యజమానులకు తరగతులు నిర్వహించారు. నాసిక్‌కు చెందిన కేవీజీవీఎన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా తరగతుల్లో పాన్ ఇండియా ట్రైనీ అధికారి సింధు, మోహన్‌బాబు, పాలకొలను యశోదాదేవిలు మాట్లాడారు. ఏపీ, తెలంగాణా, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఉండే హోటల్ యజమానులకు శిక్షణతరగతులు నిర్వహించి సర్టిఫికెట్లు అందచేస్తున్నామన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి



పెడన, మే 13 (ఆంధ్రజ్యోతి) : పెడన మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, గరికముక్కు చంద్రబాబు, వైస్ ఛైర్మన్ ఎండీ ఖాజాలు మంగళవారం పురపరిపాలన శాఖ డైరెక్టర్ పి. సంపత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీకి చెందిన 18 సెంట్ల స్థలం ఆక్రమణకు సంబంధించిన అంశాన్ని అజెండాలో చేర్చమని పలుమార్లు కోరినా కమిషనర్ ఆ అంశాన్ని అజెండాలో పెట్టలేదని వారు ఆరోపించారు. ఆక్రమణ అంశాన్ని అజెండాలో పెట్టకుండా ఆక్రమణదారుడికి అనుకూలంగా వ్యవహరిస్తున్న కమిషనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డీఎంఏను కోరారు.

జంట క్రిమినల్ కేసులు కొట్టివేత

మచిలీపట్నం టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఐదేళ్ల క్రితం వక్కలగడ్డ గ్రామంలో జరిగిన పరస్పర క్రిమినల్ కేసుల్లో ఇరువురు ముద్దాయిలపై నేరం రుజువుకాకపోవడంతో రెండు కేసులను కొట్టివేస్తూ కృష్ణాజిల్లా 6వ అదనపు జిల్లా న్యాయాధికారి పి. పాండురంగారెడ్డి మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గూడూరుకు చెందిన జి. పవన్‌కుమార్ మచిలీపట్నం ఇంగ్లీషుపాలెంలోని ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న మాగంటి నాగలక్ష్మి అనే యువతితో సినీఫక్కీలో ప్రేమను ప్రారంభించాడు. ఇరువురికి మనస్పర్థలు రావడంతో ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. సాక్షులను విచారించగా తగిన ఆధారాలు లేకపోవడంతో కేసులు కొట్టి వేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మచిలీపట్నం టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీ కాలనీల్లో ప్రజలు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డాన్‌బాస్కో నవజీవన్ బాలభవన్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమార్ అన్నారు. మచిలీపట్నం నారాయణపురం ఎస్టీ కాలనీలో మంగళవారం ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వసంతకుమారి, టీచర్ వి. రేవతి తదితరులు మాట్లాడారు. పారిశుధ్యం, పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



పల్లె పుష్కరిణిని ప్రారంభిస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్

తాడేపల్లిలో పల్లె పుష్కరిణి ప్రారంభం

ఘంటసాల, మే 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో గ్రామస్థుల సహకారంతో అభివృద్ధి చేసిన పల్లె పుష్కరిణిని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్‌లు ప్రారంభించారు. గ్రామానికి చెందిన మొవ్వ మోహన వెంకట కిషోర్ (నాని), సూరపనేని రాజేష్, షైనేని వెంకటేశ్వరరావుల సహకారంతో టీడీపీ నేత పరుచూరి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెరువు చుట్టూ ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, ఇతర అభివృద్ధి పనులను రూ.7 లక్షల వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సర్పంచ్ గాజుల నాగ శ్రీనివాసరావు, ముప్పనేని రవి ప్రసాద్, అంక మారుతిరావు, బెల్లంకొండ అమలేశ్వరరావు, నేతలు వేమూరి వెంకయ్య, యార్లగడ్డ వీరభద్రరావు, సూరపనేని శివరామ ప్రసాద్, మొవ్వ శ్రీరామ్మూర్తి, సూరపనేని వెంకట్రావు, అరవపల్లి బాపయ్య, సూరపనేని కోటేశ్వరరావు, దోనేపూడి రామకోటేశ్వరరావు, వీరంకి నాగరాజు, కొడాలి లక్ష్మణ్, కుంపటి సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణదేవరాయల మహోత్సవం

శ్రీకాకుళంలో వేంచేసి ఉన్న శ్రీ కాకుళేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణదేవరాయ మహోత్సవాన్ని బుధవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ ఎం.దుర్గాప్రసాద్, అతిథులుగా డాక్టర్ జి.వి.పూర్ణచంద్ విచ్చేయనున్నారు. అనంతరం నాట్య కళావిశారధి కేవీ సత్యనారాయణ బృందంచే శ్రీకృష్ణదేవరాయలు రచించిన అముక్త మాల్యద కావ్యం నుంచి గోదా కల్యాణం కూచిపూడి నృత్య రూపకాన్ని ప్రదర్శించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రచయితలు, కళాకారులు, కవులు హాజరవుతారని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.